# దేవుని స్త్రీ

# (The Woman of God)



## Susie Frederick

# దేవుని స్త్రీ

# THE WOMAN OF GOD

(Telugu)




Author

SUSIE FREDERICK



CHURCH OF CHRIST - SATYAVANI

P.O. Box 80

KAKINADA, A.P. - 533 001

INDIA

# విషయసూచిక

## మొదటి భాగము


| | | |
|---|---|---|
| 1. | నీవు దేవునికి విలువైన దానవు! | 3 |
| 2. | దీవెనలు మరియు బాధ్యతలు | 7 |
| 3. | ఇచ్చి పుచ్చుకొనుట | 10 |
| 4. | క్రైస్తవ ఆతిథ్యము | 12 |
| 5. | వయస్సు పై బడిన స్త్రీలు | 15 |
| 6. | నీవు బోధించ గలవు! | 18 |
| 7. | బిడ్డలకు బోధించుట | 21 |
| 8. | మన బిడ్డలకు మనమేమి బోధించవలెను? | 23 |
| 9. | క్రైస్తవ స్త్రీని గూర్చిన దేవుని ప్రణాళిక | 26 |
| 10. | ప్రజలు యేమి చెప్పుదురు? | 31 |
| 11. | దేవుని సంతోషపరచునదేది? | 35 |


## రెండవ భాగము


| | | |
|---|---|---|
| 12. | కొనియాడ దగిన స్త్రీ | 41 |
| 13. | శారా యొక్క విశ్వాసము | 44 |
| 14. | ఇస్సాకు కొరకు దేవునిచే యేర్పాటు చేయబడిన రిబ్కా | 46 |
| 15. | దేవుని అత్యున్నత శక్తి | 50 |
| 16, | సమరయ స్త్రీయొక్క ప్రాబల్యము | 53 |
| 17 | లూదియ యొక్క మంచి మాదిరి | 56 |

18. యేసుక్రీస్తులో సహాయకారియైన ప్రిస్కిల్ల 58
19. అపవాదిని ఎదిరించుడి 60
20. అది చాలునా? 62
21. వినువారు మాత్రమయి ఉండకుడి 65

## మూడవ భాగము

22. సమతుల జీవితము 69
23. అద్దములు 73
24. వాడబారని సౌందర్యము 75
25. మనము దేవుని నమ్ముచున్నామా? 78
26. ప్రార్థన నాకు ఏమైయున్నది 80
27. దు:ఖము 83
28. సాటియైన సహాయకారి 86
29. ప్రభువునందు ఆనందించుము! 89
30. సంతోషముగ యుండుటెట్లు ? 91
31. జ్ఞానమందు పెరుగుట 93
32. ఆత్మనిగ్రహములో పెరుగుట 95
33. శ్రమ ఓర్పును కలిగించును 97
34. ప్రభువు కొరకు కనిపెట్టుము 99
35. అంతరంగములో సమాధానము కలిగియుండుట 102
36. జీవితములో ప్రాముఖ్యమైన దానిని ఎంచుకొనుట 105

# మొదటి భాగము



# నీవు దేవునికి విలువైన దానవు!

## (Your are important to God)

# 1. నీవు దేవునికి విలువైన దానవు!

## (Your are important to God)

క్రీస్తు శరీరములో భాగములైన ప్రతి వ్యక్తి ముఖ్యమే. క్రీస్తుశరీరమైన సంఘము మానవ శరీరముతో సరిపోల్చబడినది. "ఒక్కశరీరములో మనకు అనేక అవయవము లుండినను ఈ అవయవములన్నిటికి ఒక్కటే పని యేలాగుండదో, అలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా యుండి, ఒకరి కొకరము ప్రత్యేకముగ అవయవములమై యున్నాము" (రోమా 12:4-5). మానవ శరీరమువలె ప్రతి అవయవము దాని దాని పనిని నిర్వర్తించునట్లు, సంఘములోని ప్రతివ్యక్తి చేయుటకు ఒక్కొక్క విధమైన పని యుండును. 1 కొరింథి 12:14-27 చదవండి.

మానవ శరీరములోని అవయవములవలె క్రీస్తు శరీరమైన సంఘములోని ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క పనిని దేవుడు నిర్ణయించును. ఏ ఇద్దరు క్రైస్తవులు ఒకే మాదిరిగ యుండరు. కనుక వారిలో యే ఒక్కరు మానివేసిన లేక సరిగ పనిచేయక పోయిన సంఘము అనే శరీరము బాధననుభవించును.

క్రీస్తు శరీరములో నీ పని యేమిటి? ఆయన కొరకు నీవు ఉప యోగించుటకు యే తలాంతులను దేవుడు నీకిచ్చి యున్నారు? ఇంటిదగ్గరనే నీవు బైబిలు తరగతులు బోధించుచుంటివా లేక చిన్న బిడ్డలకు బోధించు చుంటివా లేక ఇతర స్త్రీలకు బోధించు చుంటివా? రోగులకు సహాయము

చేయుటలో జాగ్రత్త చూపుచుంటివా? వస్త్రములు అవసరమైనవారికి వాటిని సిద్ధపరిచి యిచ్చుటకు దోహదము చేయు చుంటివా? నీయింటి వారికి దేవుని చిత్తమును గూర్చి బోధించుచుంటివా? ఇతరులకు నీవు సత్కార్యము చేయు చుంటివా? నీవు చేయగలిగిన దానికంటే యెక్కువగా చేయుటకు దేవుడు కనిపెట్టుట లేదు. కాని నీకు దేవునిచే అనుగ్రహింపబడిన వరములను సద్వినియోగము చేసికొని వాటినభివృద్ధి పరచుకొనవలెనని ఆయన ఎదురు చూచుచున్నారు. నీవు ఇంతవరకు ఉపయోగించుకొనని, అభివృద్ధి పరచుకొనని వరమేదైనా ఉండిన యెడల దానిని అభివృద్ధి చేసి కొనుటకు మాత్రము భయపడవద్దు. దేవుని కొరకు నీవు పని చేయుచున్నపుడు ఆ విషయములో దేవుడే నీకు సహాయము చేయును.

మత్తయి 25వ అధ్యాయములో ఒక మనుష్యుడు దేశాంతరమునకు ప్రయాణమై తన దాసులను పిలిచి తన ఆస్తిని అప్పగించిన ఉపమానమును యేసు చెప్పెను. ప్రతి దాసునికి యెవని సామర్థ్యము చొప్పున అతడు వారికిచ్చెను. ఒక సేవకునికి ఐదు తలాంతు లిచ్చెను. అతడు దానితో తెలివిగ పనిచేసి మరో ఐదు తలాంతులను సంపాదించెను. మరియొకనికి రెండు తలాంతు లీయబడెను. అతడు కూడ దానితో తెలివిగ పనిచేసి మరి రెండు తలాంతులు సంపాదించగలిగెను. మూడవ వానికి ఒక్క తలాంతు మాత్రమే ఈయబడినను, అతడు ఆ ఒక్కదానితోనైనా తెలివిగ పని చేయలేదు. అతడు దానిని ఖర్చు కూడ పెట్టలేదు. వడ్డీకైనా ఎవరికి యివ్వలేదు. సరిగదా అతని యజమానుడు వచ్చు వరకు దానిని భూమిలో దాచిపెట్టెను. మొదటి యిద్దరి దాసులను గూర్చి ఆ యజమానుడు యెంతో సంతోషించెను గాని మూడవ దాసునిపై కోపపడెను. వానికీయబడిన తలాంతును జ్ఞానయుక్తముగ ఉపయోగించని ఆ దాసుని యొద్ద నుండి ఆ తలాంతు తీసివేయబడి మొదటి వానికీయబడెను. నిష్ప్రయోజకుడైన ఆ దాసుని వెలుపల చీకటి లోనికి త్రోసి వేయుడని ఆ యజమాని చెప్పెను.

దేవుడు మనకిచ్చిన వరములను మనము సద్వినియోగ పరచుకొనకుంటే యేమి సంభవించునో దానిని మనము తెలిసికొనుటకు యేసు మనకీ ఉపమానమును చెప్పెను. దేవుడు మనకనుగ్రహించిన వరములను మనము ఉపయోగించుకొననిచో వాటిని ఆయన మన యొద్ద నుండి తీసివేయును. "ఆమెకున్నంత నేర్పు నాకు లేదు. అందుకే ఆమెనే ఆ పనిచేయ మంటిని" అని చెప్పకూడదు. మనలో ప్రతి ఒక్కొక్కరికి ఒక్కొక్కవిధమైన సామర్థ్యమును దేవుడు మనందరికి యిచ్చారు. కనుక మనమందరము కూడ దేవునికి ముఖ్యులమే. ప్రతి క్రైస్తవ స్త్రీ ఆమెకీయబడిన సామర్థ్యము కొలది దేవుని కొరకు పనిచేసిన యెడల దేవునికి ఎంతో సంతోషము కలుగును. ఈ ఉపమానములోని మొదటి సేవకునిగూర్చి ఐదు తలాంతులు ఈయబడిన దాసుడు సంతోషించిన విధముననే రెండవ దాసుని గూర్చి (రెండు తలాంతు లీయబడిన దాసుడు) కూడ సంతోషించెను, ఎందుకనగా రెండవ దాసుడు కూడ తనకీయబడిన వరమును సద్వినియోగ పరచుకొనెను. అపొస్తలుడైన పౌలు 1 కొరింథి12వ అధ్యాయములో చెప్పిన రీతిని వారి కుండిన లాంటి వరములు మనకు లేవు గనుక తక్కువైన వారిగా ఎంచుకొన గూడదు. దేవుడు యోచించిన ప్రకారము ప్రతి ఒక్కరికి తలాంతులు అనుగ్రహించెను. ప్రతివాడు స్త్రీ యైనా, పురుషుడైనా వారి, వారి సామర్థ్యమును బట్టి దేవునిచే ఈయబడిన వరములను శరీరము (సంఘము) సక్రమముగ పనిచేయునట్లు వాటిని ఉపయోగించవలెను. "ఆయన శిరసైయున్నాడు. ఆయన నుండి సర్వశరీరము చక్కగా అమర్చబడి, తనలో నున్న ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పనిచేయుచుండగా, ప్రతికీలు వలన కలిగిన బలము చేత అతుకబడి, ప్రేమయందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు అభివృద్ధి కలుగజేసి కొనుచున్నది" (ఎఫెసీ 4:16).

మనకీయబడిన వరములను జ్ఞానయుక్తముగ వినియోగించు కొనిన

యెడల యింకను యెక్కువైన వాటిని దేవుడు మనకనుగ్రహించును అని మనము తెలిసికొనవలెను, యేసు ప్రభువు ఈ విధముగ చెప్పుచున్నారు: “కలిగిన ప్రతివానికి ఇయ్యబడును అతనికి సమృద్ధిగా కలుగును. లేనివాని యొద్ద నుండి వానికి కలిగినదియు తీసివేయబడును” (మత్తయి 25:29).

నీ వలె మరి యొకరెవరు లేరు. నీ స్థానమును మరొకరు తీసి కొనలేరు. మరెవ్వరికి నీకుండినట్టి ఒకేవిధమైన వరములు గాని, తరుణములు గాని లేకుండును. మనమందరము ఏయే వరములను కలిగి యుంటిమో పరిశీలించుకుందము. వాక్యము చదువుట ద్వారా, ప్రార్థించుట ద్వారా మన వరములను అభివృద్ధి పరచుకొని మనము చేయ గలిగినంత మంచిగ వాటిని ఉపయోగించుకుందుము. మనము సిద్ధముగ యున్నపుడు దేవుడు మనకు సహాయము చేయును. క్రీస్తు యొక్క శరీరము అనే సంఘమును నిర్మించుటలో, దానిని అభివృద్ధి పరచుటలో మనకు యింకను యెక్కువైన శక్తి, సామర్థ్యములను దేవుడు మనకు దయచేయును.

# ౨. దీవెనలు మరియు బాధ్యతలు

## (Blessings and Responsibilities)

“ఎవనికి యెక్కువగ ఈయబడెనో, వాని యొద్ద యెక్కువగ తీయజూతురు. మనుష్యులు యొవనికి యెక్కువగ అప్పగింతురో వానియొద్ద యెక్కువగా అడుగుదురు” (లూకా 12:48) అని ప్రభువైన యేసు చెప్పారు. దేవుని నుండి మనము దీవెనలు పొందినపుడు వాటిని జ్ఞానయుక్తముగ ఉప యోగించుకొనవలెను. దేవుడు నిన్ను యేవిధముగ దీవించారు? వాటిని బట్టి నీ నుండి దేవుడు యేమి కోరుచున్నారు? ప్రతి వ్యక్తి ఈ ప్రశ్నకు వ్యక్తిగతముగ జవాబు చెప్పవలసిన వారైయున్నారు.

దేవుడు ఆరోగ్యముగా యుండే దీవెన యిచ్చారా? నీకు ఆరోగ్యముగా యుండే దీవెన యిచ్చినట్లయిన అనారోగ్యముగా యుండే వారికి సహాయ పడవలెను. వారి ఆరోగ్యము బాగుపడే వరకు వారికి ఆహారము సిద్ధపరచి యివ్వవలసి వచ్చును లేదా వారి బిడ్డలను కాపాడ వలసివచ్చును. ఈ విధముగ నీ మంచి ఆరోగ్యము ద్వారా యితరులకు మేలుకరముగ యుండగలవు.

ఐశ్వర్యము (ధనము)తో దేవుడు నిన్ను దీవించెనా? అయితే యితరులకు మేలు చేయుటకు నీ ధనమును యెట్లు ఉపయోగించు చున్నావు? ప్రపంచములోని అనేకులు దేవుని గూర్చియు, ఆయన కుమారుడైన యేసును గూర్చియు తెలిసికొన ఆశపడుచున్నారు. బోధకులైన

వారికి సువార్తను ప్రకటించు విషయములలో ధనము చాలా అవసరముగ యుండును. తినుటకు ఆహారము, ధరించు కొనుటకు వస్త్రములు, గృహవసతి మున్నగు అవసరతలలో యున్నవారు కొంత మంది నీకు తెలిసి యుండవచ్చును. నీవు నీ ధనమును ఇట్టి అవసరతలలో యున్నవారి కొరకు వినియోగించి వారికి సహాయపడ వచ్చును. అటువంటి క్రైస్తవ ప్రేమ దేవుని వాక్యమును వినుటకు వారి హృదయ ములను తెరచుటకు సహాయపడును.

సాధారణమైన విద్యనందించుట ద్వారా దేవుడు నిన్ను దీవించెనా? ఈ వ్రాయబడిన అంశమును నీవు చదువ గలిగిన యెడల ప్రపంచములోని అనేక మంది కంటె నీవు ధన్యురాలవు. ఈ పాప భూయిష్టమైన ప్రపంచమునకు క్రీస్తు సువార్తయే గొప్ప నిరీక్షణ." సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16), సువార్తను నమ్మి, దానికి విధేయత చూపించిన వారు పాపముల నుండి రక్షింపబడుదురు. "మీరు పాపమునకు దాసులైయుంటిరి గాని, యే ఉవ దేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడిన వారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి". (రోమా 6: 17-18). అయితే ఒక వ్యక్తి నమ్మునట్లు ముందుగా సువార్తను వినవలెను. బోధించు వారు లేకున్న యెడల వారు యెట్లు వినగలరు? "వారు విశ్వసింపని వానికి యెట్లు ప్రార్ధన చేయుదురు? వినిన దానిని యెట్లు విశ్వసింతురు? ప్రకటించు వాడు లేకుండ వారెట్లు విందురు?" (రోమా 10:14). "కాగా వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును." (రోమా 10:17) దేవుని వాక్యమును చదువుట ద్వారా దేవుని చిత్తమును తెలిసికొనలేని వారికి నీవు బోధించ గలవా?

నీకీయబడిన దీవెనలను ఇతరుల మేలు కొరకు ఉపయోగించుట ద్వారా నీవు దేవునిని సంతోషపరచుము. నీవు చేయు దానికంటే అత్యధికముగా దేవుడు నిన్ను దీవించును. “తగిన కాలమున ప్రతివానికి ఆహారము పెట్టుటకు, యజమానుడు తన యింటివారి మీద వుంచునట్టి నమ్మకమైన బుద్ధి గల గృహ నిర్వాహకుడెవరు? ఎవని ప్రభువు వచ్చి వాడు అలాగు చేయుచుండుట కనుగొనునో ఆ దాసుడు ధన్యుడు. అతను తనకు కలిగిన దాని యంతటి మీద వానిని ఉంచునని నిజముగా మీతో చెప్పుచున్నాను” (లూకా 12:42-44).

# 3. ఇచ్చి పుచ్చుకొనుట

## (Caring and sharing)

ఒక వ్యక్తి దేవుని ఆజ్ఞలకు విధేయుడై వాటిని గైకొనుచున్నపుడు దేవుడా వ్యక్తికి తండ్రియై యుంటాడు. "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26-27). మీరు శరీరాను సారముగా ప్రవర్తించిన యెడల చావవలసిన వారై యుందురు. కాని ఆత్మచేత శరీర క్రియలను చంపినయెడల జీవించెదరు. దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదు గాని దత్త పుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగిన వారమై మనము - అబ్బా తండ్రీ అని మొర పెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మతానే మన ఆత్మతో కూడా సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, క్రీస్తుతోడి వారసులము (రోమా 8:18, 17). అందరు దేవునికి విధేయులైనట్లయిన మన మందరము దేవుని పిల్లలము, అప్పుడు మనము సోదర, సోదరీలము. ఈ విధముగా సంఘము ఒక పెద్ద కుటుంబముగా యుండును.

దేవుని సంకల్పము ప్రకారము మన కుటుంబములోని వారందరిని ఎంతో ప్రేమించుదము. వారికి ఆహారము యిచ్చి, వస్త్రములిచ్చి, వారి

అవసరతలన్నియు తీర్చుచూ కుటుంబము లోని అందరు సంతోషముగా యుండునట్లు చూచుకొంటాము. ఈ విధముగనే ఆత్మీయ సంబంధమైన కుటుంబములో అవసరతలలో యున్నవారికి సహాయపడుచుండ వలెను.

మన కుటుంబ సహవాసముతో మనము ఆనందించు చుందుము. కుటుంబములోని వారిని దీవించుమని దేవునికి ప్రార్థన చేయుదుము. అట్లు దీవింపబడినపుడు వారిని బట్టి మనము ఆనందించెదము. మన కుటుంబము లోని యేవ్యక్తికి యైనా బాధగాని, దు:ఖము గాని పొందుచున్నపుడు వారు బాగుండుటకు కావలసిన సహాయము చేయుదుము. మన ఆత్మీయ కుటుంబములో కూడా యిటువంటి సహవాసము కలిగి యుండవలెను. ఆత్మీయ సంబంధమైన సోదర, సోదరీలు యొక్క కష్ట సుఖములలో మనము పాలు పుచ్చుకొనవలెను. “సంతోషించు వారితో సంతోషించుడి, ఏడ్చు వారితో ఏడువుడి” (రోమా 12:15). ఈ విధముగా చేసినట్లయిన అదే రీతిలో మనకు ప్రోత్సాహము కలుగును. యిద్దరు కలిసి ఒక భారమును లేదా ఒక సమస్యను పరిష్కరించ వలసి వచ్చినపుడు అది సగము మట్టుకే భారమనిపించును. అయితే యిద్దరు కలిసి సంతోషించు నపుడు ఆ సంతోషము రెట్టింపగును.

మన శరీర సంబంధమైన కుటుంబములు మనపై ఆధారపడి యుండును. మనము వారిపై ఆధారపడుదుము. శరీర సంబంధమైన ఆత్మీయ పరమైన విషయముల కొరకు కుటుంబములో ఒకరిపై ఒకరు ఆధారపడిన రీతినే మన ఆత్మీయ పరమైన పెద్ద కుటుంబములో కూడ జరుగుచుండవలెను.

# 4. క్రైస్తవ ఆతిధ్యము

## (A Christian Service)

క్రైస్తవ స్త్రీలముగ దేవుని ఆరాధించుటలో మనకు కొన్ని పరిమితులు గలవు. పురుషులతో కూడియున్న ఆరాధనలో ప్రార్థించుట గాని, బోధించుట గాని, మరియే యితరమైన విషయములలో నాయకత్వము వహించుట గాని చేయకూడదు. "స్త్రీలు మౌనముగా యుండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగ యుండవలసినదే గాని ఉపదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను" (1 తిమోతి 2:11-12), "స్త్రీలు సంఘములో మౌనముగా యుండవలెను. వారు లోబడి యుండ వలసిన వారేగాని మాటలాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది" (1 కొరింధి 14:34). కాని అతిథి సత్కార్యముల విషయములో మనము పరిమితి లేని పరిచర్యను చేయవచ్చును.

క్రైస్తవులు ఆతిధ్యము యిచ్చుటకు ఆజ్ఞాపింపబడిరి. "సహోదర ప్రేమ విషయములలో ఒకని యందొకడు అను రాగము గలవారై, ఘనత విషయములలో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి. ఆసక్తి విషయములో మాంద్యులు కాక, ఆత్మ యందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి, నిరీక్షణ గలవారై సంతోషించుచు, శ్రమ యందు ఓర్పుగలవారై ప్రార్థన యందు పట్టుదల కలిగి యుండుడి. పరిశుద్ధుల అవసరములలో పాలు పొందుచు శ్రద్ధగా ఆతిధ్యము ఇచ్చుచుండుడి" (రోమా 12:10-13),

మన గృహములను, ఆహార పదార్థములను క్రైస్తవులకు (పరిశుద్ధులకు) వారి అవసరతలలో సహాయము చేయుటకు మనకు అవకాశము కలిగినప్పుడంతా సహాయ పడవలెను. వారికి మాత్రమే గాక దేవుని వాక్యమును బోధించి, నేర్పించు వారికి కూడ అవకాశము కలిగినప్పుడల్లా అతిధి సత్కారము చేయుట ద్వారా మనము కూడ దేవుని వాక్యమును ప్రకటించుటకు సహాయపడిన వారము కాగలము. ప్రవక్తయని ప్రవక్తను చేర్చుకొనువాడు ప్రవక్త ఫలము పొందును; "నీతిమంతుడని నీతిమంతుని చేర్చుకొనువాడు నీతిమంతుని ఫలము పొందును" (మత్తయి 10:41). యేసు ఈ విధముగ చెప్పుచున్నారు. నేను ఆకలి గొంటిని మీరు నాకు భోజనము పెట్టితిరి. దప్పిగొంటిని. మీరు నాకు దాహమిచ్చితిరి, పరిదేశినై యుంటిని, నాకు బట్ట లిచ్చితిరి. రోగినై యుంటిని, నన్ను చూడ వచ్చితిరి. చెరసాలలో యుంటిని, నా యొద్దకు వచ్చితిరని చెప్పును. అందుకు నీతి మంతులు - ప్రభువా, ఎప్పుడు నీవు ఆకలి గొని యుండుట చూచి నీకాహార మిచ్చితిమి? నీవు దప్పిగొని యుండుట చూచి యొప్పుడు దాహ మిచ్చితిమి? ఎప్పుడు పరదేశివై యుండుట చూచి నిన్ను చేర్చు కొంటిమి? దిగంబరివై యుండుట చూచి బట్టలిచ్చితిమి? ఎప్పుడు రోగివై యుండుట యైనను, చెరసాలలో యుండుట యైనను చూచి నీ యొద్దకు వచ్చితిమని ఆయనను అడిగెదరు. అందుకు రాజు - మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకును చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును". (మత్తయి 25:35-40). కనుక క్రైస్తవ సోదర, సోదరీలకు మనము వారి అవసరతలలో తోడ్పడిన యెడల అది మన ప్రభువుకు చేసినట్లే యగును.

మనకు తెలిసిన వారికి, తెలియని వారికి కూడ సత్కార్యము చేయుటకు వెనుకాడ కూడదు. "ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు. శుభమని వానితో చెప్పను

వద్దు, శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును" (2 యోహాను: 10,11). కనుక అబద్ధ బోధకుల విషయములో మనము జాగరూకులమై యుండవలెను.

"అప్పుడు రాజు తన కుడివైపున ఉన్న వారిని చూచి – నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని చెప్పును (మత్తయి 25:34). కనుక మనము అతిథి సత్కారము చేయుట ద్వారా పైన చెప్పబడిన వారి గుంపులో యుందము. "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదుము" (గలతీ 6:10)

ప్రియ సోదరీమణులారా,

ఈ పాఠము మనందరికి వర్తించును. ప్రాముఖ్యముగ భారతదేశము లోని క్రైస్తవ స్త్రీలతో నేను మాటలాడునపుడు వారి యొక్క అతిథి సత్కారము మంచి మాదిరిగ యుండెను. నేను భారత దేశములో యుండినపుడు వారు నా యెడల చూపిన దయను బట్టి నేను వారిని అభినందించుచు మా అమెరికాలోని స్త్రీలము కూడా భారతదేశ స్త్రీలవలె మంచి ఆతిధ్యము నిచ్చుటకు సమకట్టుదుము.

# 5, వయస్సు పై బడిన స్త్రీలు

## (The Aged Women)

వృద్ధాప్యమనునది జీవితములో ఒక భాగము. మనము జీవించు దినముల కొలది మనము వృద్ధుల మగుచుందుము. అది దేవుని ప్రణాళికలో ఒక భాగము. "నెరసిన వెంట్రుకలు సొగసైన కిరీటము. అవి నీతి ప్రవర్తన గలవానికి కలిగి యుండును" (సామెతలు 16:31). చాల మంది వృద్ధులగు చుండగా వారు చేయు పనుల నుండి విరమించి నెమ్మదిగా యుందురు. అది చాలామంచిది. క్రైస్తవ జీవితము జీవించుటకు విరామ మనేది దేవునిచే యేర్పాటు చేయబడలేదు. "అంతము వరకు సహించిన వాడెవడో వాడే రక్షింపబడును" (మత్తయి 24: 18) అని యేసు చెప్పుచున్నారు. అయితే శారీరకముగా నీవు చేయుగలిగిన దానికంటే యెక్కువగా దేవుడు కోరుచున్నాడని అర్థముకాదు. "నేను యిది వరకూ చాలా పని దేవుని కొరకు చేసాను. ఇప్పుడు నాకంటె యౌవ్వన దశలో యుండిన వారు నా స్థానము తీసికొనవచ్చును" అని చెప్పుటలో దేవునిని సంతోషపరచలేవు. సొలొమోను మహారాజు ఈ విధంగా చెప్పుచున్నాడు. "బుద్ధిహీనుడు చేతులు ముడుచుకొని తన మాంసము భక్షించును". (ప్రసంగి 4:5). సోమరియైన వాడు శారీరకముగా వృద్ధుడైన రీతిని క్రైస్తవుడైన వ్యక్తి దేవుని సేవ చేయుటలో ఉత్సాహము లేక చురుకుదనము చూపించని వాడు ఆత్మీయముగా నష్టపోవును. నీవు బుద్ధిహీనునిగ యుండి నిన్ను నీవు వ్యర్ధపరచు కొనలేవు. అయితే దేవుడు నీ నుండి యేమి కోరుచున్నారు?

“వృద్ధుల యొద్ద జ్ఞానమున్నది, దీర్ఘాయువు వలన వివేచన కలుగు చున్నది” (యోబు 12:12) అని మీరు చెప్పుదురు. మంచి అనుభవముతో కూడిన దీర్ఘాయువు కలిగియుండుట ద్వారా నీవు యితరులకు మంచి సలహాల నీయగలవు. నీకు మంచి సలహాలు ఈయగలిగే తరుణము సంకల్పమైనపుడు అది ప్రేమతో చేయవలెను గాని వారి నుండి లాభమును కోరవద్దు.

“అలాగుననే వృద్ధ స్త్రీలు కొండె కత్తెలును మిగులమద్య పానాసక్తులునై యుండక, ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలెననియు, మంచి ఉపదేశము చేయువారునై యుండవలె ననియు బోధించుము” (తీతుకు 2:3). మంచి మాదిరిని చూపించుట చాలా ప్రాముఖ్యమైన విషయము. నీవు క్రీస్తు మాదిరిని అనుసరించుట వలన యౌవ్వన స్త్రీలు నీ జీవిత మాదిరిని అనుకరించుట ద్వారా నీకు గౌరవము కలుగును.

“దేవుని వాక్యము దూషింపబడ కుండునట్లు, యౌవ్వన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి, తమ భర్తలను, శిశువులను ప్రేమించుచు, స్వస్థబుద్ధి గలవారును, పవిత్రులును, ఇంట ఉండి పనిచేసుకొను వారును, మంచివారునై యుండవలెనని బుద్ధి చెప్పుచు మంచి ఉపదేశము చేయు వారునై యుండవలెనని బోధించుము” (తీతుకు 2:3-5). నీవు మంచి మాదిరిని కనబరచు చున్నపుడు నీ పని పూర్తి అయినదని తలంచవద్దు. నీవు మంచి మాదిరిని కనబరచుట ద్వారా యౌవ్వనస్థులైన స్త్రీలకు మంచి ప్రోత్సాహకరముగా బోధించగలవు. నీ జీవిత విధానము మంచి మాదిరిగ లేకుండ నీవు బోధించిన యెడల దేవుని వాక్యమును గూర్చి ప్రజలు చెడుగా మాట్లాడుదురు.

మనము వయస్సులో పెరుగుచూ యుండగ ఈ క్రింది విషయమును మరువకుందము. “మనము మేలు చేయుట యందు విసుగకయుందము.

మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోయుదుము" (గలతి 6:9). మనమందరము మన జీవిత దినము లన్నియు యేసు యొక్క పరిచర్యను అలయక చేసిన యెడల దేవుని నుండి తగిన బహుమానము పొందుదుము. "మరణము వరకు నమ్మకముగ యుండుము. నేను నీకు జీవకిరీట మిచ్చెదను" (ప్రకటన 2:10).

# 6. నీవు బోధించ గలవు!

## (You Can Teach!)

“కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి: తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదా కాలము మీతో కూడ యున్నానని వారితో చెప్పెను” (మత్తయి 28:19-20).

చాల మంది క్రైస్తవులు వారు దేవుని వాక్యమును బోధించుటకు తగిన వారము కామని తలంతురు. అయితే మనము వాక్యము ప్రకటించవలెనని దేవుని ద్వారా ఆజ్ఞాపింపబడితిమి కనుక మనము వాక్యమును బోధించుటకు దేవుని సహాయమును కోరినచో తప్పక దేవుడు సహాయము చేయును. పురుషులు కూడి యుండే ఆరాధన స్థలములో స్త్రీలు బోధింప రాదు. “స్త్రీలు మౌనముగా యుండవలసినదే గాని ఉపదేశించుట కైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను” (1 తిమోతి 2:12), అనేక సమయాలలో, స్థలములలోను బోధించుటకు మనకు అవకాశము కలుగును. వాక్యము బోధించ లేను అని చెప్పుటకు గల కొన్ని కారణములను బైబిలు నుండి పరిశీలించుదము.

మోషేవలెకొంతమంది నాకు వాక్చాతుర్యము లేదందురు. “అప్పుడు మోషే - ప్రభువా, ఇంతకు మునుపైనను, నీవు నీ దాసునితో

మాటలాడినప్పటి నుండి యైనను, నేను మాట నేర్పరిని కాను, నోటి మాంద్యము, నాలుక మాంద్యము గలవాడనని యెహోవాతో చెప్పగా" (నిర్గమ 4:10), యెహోవా మోషేను ఈలాగు ప్రశ్నించెను. "మానవులకు నోరిచ్చిన వాడు ఎవడు? మూగవానేగాని, చెవిటి వానినేగాని, దృష్టి గల వానినే గాని, గ్రుడ్డి వానినేగాని పుట్టించిన వాడెవడు? యెహోవానైన నేనేగదా" (నిర్గమ 4:11).

మనలను సృష్టించిన దేవునికి మన బలహీనతలు, శక్తి సామర్థ్యములు అన్నియు తెలియును. మనకు ప్రావీణ్యము లేని విషయములను చేయుమని ఆయన మనలను అడుగుటలేదు. ఆయన వాక్యమును ప్రకటించుమని మనలను కోరుచున్నారు గనుక ఆయన ఆజ్ఞను గైకొనుటకు మనకు సహాయము చేయునని విశ్వసింపవలెను, దేవునికి అసాధ్యమైన దేదియు లేదు.

మరికొందరు అపొస్తలులైన పేతురు, యోహానుల వలె మేము విద్యలేని పామరులము, తర్ఫీదులేని వారమని తలంతురు. "వారు పేతురు, యోహానుల ధైర్యము చూచినపుడు వారు విద్యలేని పామరులని గ్రహించి ఆశ్చర్యపడి వారు యేసుతో కూడ యుండిన వారని గుర్తెరిగిరి" (అపొ.కా. 4:18). అయితే వారు దేవుని చిత్తమును గూర్చి ధైర్యముగా బోధించుటకు వారి కేమియు అడ్డురాలేదు. ప్రజలు యేమి చేయవలెనని దేవుడు కోరుచున్నాడో వారికి తెలియును. వారు పని చేయుటకు కావలసిన - విద్య అదియే. క్రైస్తవులు కాగలుగుటకు యేమి చేయవలెనో ఎరిగి యుండిన యెడల యితరులకు మనము దానిని గూర్చి బోధింపగలము. బైబిలును చదువుట ద్వారా మనము జ్ఞానార్జన చేయుచున్నపుడు సత్యమును గూర్చి మనము సంపూర్తిగా బోధింప గలము.

కొందరు మేము చాల పేదవారము గనుక మా మాటలు యెవరు

వినరని చెప్పుదురు. ఈ సందర్భముగ యేసు చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొందము. అందుకు “యేసు నక్కలకు బొరియలును, ఆకాశ పక్షులకు నివాసములును గలవు గాని మనుష్య కుమారునికి తలవాల్చుట కైనను స్థలము లేదని అతనితో చెప్పెను” (మత్తయి 8:20). దేవుని కుమారునికి తన స్వంతమని చెప్పుకొనుటకు యిల్లు కూడ లేదు. ఇహ లోక సంబంధమైన ఐశ్వర్యము దేవునికి ప్రాముఖ్యము కాదు. మనము మంచి పనులు చేయుటలో ఘనమైన వారముగ యుండవలెనని ఆయన కోరుచున్నాడు. వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసికొనుచు, మేలు చేయు వారును, సత్క్రియలు అను ధనము గలవారును, ఔదార్యము గలవారును, తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెనని వారికా జ్ఞాపించుము” (1 తిమోతి 6:18) మనము మంచి మాదిరి గల వారమైన యెడల ప్రజలు మనలను గౌరవింతురు. మనము బోధించే బోధనలను వినుటకు కూడ ఆసక్తి గలవారై యుందురు.

మనము బోధించుటకు ప్రారంభింపక పూర్వము అన్ని విషయములు సక్రమముగ యుండువరకు కనిపెట్టరాదు. నీకు తెలిసిన విషయమును బోధించుటకు యిప్పుడే ప్రారంభించుము. నీవు యెక్కువగ తెలిసికొన గలుగునట్లు బోధించ గలుగునట్లు వాక్యమును యెక్కువగా చదువుము. యేసు చేసిన వాగ్దానమును జ్ఞాపక ముంచుకొనుము. “ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా యున్నానని వారితో చెప్పెను” (మత్తయి 28:20).

“నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయనని ఆయనయే చెప్పెను గదా” (హెబ్రీ 18:5).

# 7. బిడ్డలకు బోధించుట

## (Teaching the Children)

మనము చేయదగు నట్టి పనులన్నిటిలోను మిక్కిలి ప్రాముఖ్యమైనది దేవునిని గూర్చి మన బిడ్డలకు బోధించుట. ఈ విషయమును గూర్చిన బాధ్యత గృహములో తల్లికి, తండ్రికి కూడా గలదు. సాధారణముగ బిడ్డలకు బోధించుటకు తల్లికి యెక్కువ అవకాశముండును. తల్లి బిడ్డలతో ఎక్కువ సమయమును యింటిలో గడుపును గనుక తల్లికి యెక్కువ అవకాశ ముంటాది. మనము అనేక రీతులుగ దేవునిని సేవించినపుడు మనము బోధించే వరమును యెక్కువగ అభివృద్ధి చేసికొనగలము.

బిడ్డలు చక్కగా గ్రహించ గల్గునట్లు చిన్న చిన్న మాటలను ఉప యోగించవలెను. నీవు బోధించుటకు సిద్ధపడుచున్నపుడు బైబిలులోని కథలను అనేక మార్లు చదువుము. నీవు ఆ కథను బాగుగా తెలిసికొని నట్లయిన వారు గ్రహించగలిగే మాటల ద్వారా ఆ బైబిలు కథను బిడ్డలకు చక్కగా చెప్పగలవు. కథలోని ఏ అంశములను మార్పు చేయుటకు గాని, బైబిలు నందు వ్రాయబడని విషయములను కలుపుటకు గాని ప్రయత్నించ వద్దు.

ప్రస్తుత పరిస్థితులతో బైబిలు కథలను సరిపోల్చు చుండుము. ఈ విధముగ చేయుట ద్వారా క్రైస్తవ జీవిత విధానమును నీవు నేర్పించ గలవు. యేసు ప్రేమ గలిగిన మంచి సహాయకుడు అని చెప్పుటకు బైబిలులో

అనేక నిదర్శనములు గలవు. అపొస్తలుడైన పౌలు మిక్కిలి కష్ట పరిస్థితులలో కూడా దేవునిని ఆరాధించాడు. ఇది యొక ఉదాహరణ: ఏదేను తోటలో ఆదాము దేవునితో అబద్ధము చెప్పెను గాని దేవునిని మోసపరచలేదు. దేవునికి సమస్తము తెలియును. క్రైస్తవ నియమములు మనకు అనుదిన జీవితములో ప్రాముఖ్యమైనవని బిడ్డలకు బోధింపవలెను.

బిడ్డలు చిన్నవారుగ యుండినపుడు నేర్చుకొనిన విషయములను వారి జీవిత కాలమంతటిలోను వాటిని జ్ఞాపకమందుంచు కొందురు. మీ బిడ్డలతో కలిసి మీ పొరుగు వారి బిడ్డలను కూడా పిలిచి వారికిని నేర్పించుచుండిన యెడల వారు కూడా క్రైస్తవులు కాగలరు.

మీరు బైబిలు చదువుచుండుటను మీ బిడ్డలు చూచు చుండవలెను. వాక్యము చదువుట యనేది మీకు ముఖ్యమని వారు తెలిసికొనిన యెడల వారు కూడ దానిని ప్రాముఖ్యముగనే యెంచుదురు. మీ మాటలను, మీ చేతలను వారు ఎప్పుడూ గమనించు వారు మీ యొద్ద నుండి నేర్చుకొనెదరని జ్ఞాపక ముంచుకొనుము.

# 8. మన బిడ్డలకు మనమేమి బోధించవలెను?

## (What shall we teach our Children?)

తండ్రి కంటె తల్లి యెక్కువ సమయమును బిడ్డలతో గడుపును గనుక సర్వసాధారణముగ బిడ్డలకు బోధించుట యనే భారము తల్లికి యొక్కువగ యుండును. మన బిడ్డలకు మనమేమి బోధించవలననెడి విషయమును గూర్చి కొంత విపులముగ ఆలోచించుదము.

బైబిలులోని ప్రాముఖ్యమైన విషయముల నుండి బిడ్డలకు నేర్పుటకు ప్రారంభించవలెను. 1) దేవుడు ప్రపంచమును, దానిలోని సమస్తమును సృష్టించెను. 2) దేవుడు వారిని ప్రేమించెను. 3) వారిని కాపాడు చుండెను. ఒక చిన్న బిడ్డతో సంభాషణ ఈ విధముగ యుండవచ్చును. "ఈ పక్షిని చూడు ఆపక్షిని దేవుడు చేసెను. దానిని గూర్చి దేవుడు జాగ్రత్త తీసికొనుచు దానిని కాపాడు చుండును". లేక ఈ విధముగ చెప్పవచ్చును. దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు. ఆయన నీకు ఆహారము యిచ్చుచున్నారు. నిన్ను ప్రేమతో కాపాడుకొనే తల్లిని నీకు దేవుడు యిచ్చాడు" అని చెప్పవచ్చును.

ఈ ముఖ్య విషయములను బిడ్డ గ్రహించు కొనినపుడు బైబిలు నందలి కథలను నీవు నీబిడ్డకు చెప్పవచ్చును. చిన్న బిడ్డలు యాజకునికి సహాయము చేసిన బాలుడైన సమూయేలు కథల వంటివి యిష్టపడుదురు (1 సమూయేలు 3). నయమాను యొక్క పరిచారకురాలైన చిన్న బిడ్డ

(11 రాజులు 5:1-14) బాలుడైన యేసు (లుకా 2:41-52) తన భోజనమును పంచుటకు యిష్టపడిన బాలుడు (యోహాను 6:14). ఈ కథలను బిడ్డలకు చెప్పవలెను. ఇదియే గాక వారు కొన్ని క్రియలతో కూడిన కథలను కూడ యిష్టపడుదురు. అవి యెరికో యొక్క నాశనము (యెహోషువ 6:1-24) దావీదు గొల్యాతును నాశనము చేయుట (1 సముయేలు 17) యోసేపు యొక్క జీవిత చరిత్ర (ఆదికాండము 37, 50) యేసు చేసిన అద్భుత కార్యములు. ఈ కథలు చెప్పుచుండగా వీటికి సంబంధించిన చిన్న చిన్న పటములను గీసి చెప్పిన వారు బాగుగా జ్ఞాపక ముంచు కొనగలరు. వాటికి సంబంధించిన చిన్న చిన్న పాటలు నేర్చిన కూడ మంచిది.

బైబిలు కథలను బిడ్డలకు తెలియుజెప్పు చుండగ వారి చిన్న ప్రపంచమునకు సరిపోల్చుచు చెప్పుచుండుటకు జ్ఞాపకముంచుకొనవలెను. దావీదు వలె దేవుని యందు నమ్మక ముంచవలెనని, యేసు దేవునికి విధేయుడై యుండిన రీతిని విధేయత కలిగి యుండవలెనని, తన భోజనమును పంచి పెట్టుటకు యిష్టపడిన చిన్నబాలుని వలె యుండవలెనని వారికి బోధించ వలెను.

వారు పెద్ద వారగుచుండగా పాపమును గూర్చి, పాప క్షమాపణను పొందుటను గూర్చి, సంఘమును గూర్చి, సంఘ సభ్యత్వమును గూర్చి, ఇతరులకు మాదిరికరమైన జీవితమును చూపించుటకు గాను అనుదిన క్రైస్తవ జీవితమును గూర్చి బోధించు చుండవలెను.

మన బిడ్డలకు మనము బోధించుచున్నపుడు మనము చెప్పే విషయములన్నీ యదార్ధమైనవే గాని కల్పితములు కావని వారు గ్రహించునట్లు తెలియపరచవలెను. వారు నేర్చుకొనుచున్న ప్రతీ బైబిలు అంశము యధార్ధమేయని వారికి రూఢిగా తెలియ పరచవలెను. కొన్ని

కల్పనా కథలు మతపరమైనవి. మరికొన్ని వినోదము కొరకు కల్పించ బడినవి. ఏ యుద్ధేశ్యమైన కానిమ్ము కట్టు కథలు జరిగినవని చెప్పే కల్పితములు. కాని బైబిలు నందు పొందు పరచబడిన ప్రతి అంశము కూడ అది నిజముగ జరిగినట్టి దేయని చెప్పవలెను.

ఆఖరిగా నేను మమ్మును హెచ్చరించున దేమనగా మీరు బైబిలును యొక్కువగా చదువుటకు సమయమును వెచ్చించండి. ఎందుకనగా మీరు మీకు తెలియని దానిని సరిగ నేర్పించలేరు గదా. అందుచే ముందుగ మీరు ఆ అంశములన్నిటిని బాగుగా తెలిసికొనిన వారై యుండవలెను.

# 9. క్రైస్తవ స్త్రీని గూర్చిన దేవుని ప్రణాళిక

## (God's plan for the Christian Woman)

నీ జీవితమును గూర్చిన ఒక ప్రాముఖ్యమైన ఉద్దేశమును దేవుడు నీ యెడల కలిగియున్నాడు గనుక నీవు దేవునికి ఒక ప్రాముఖ్యమైన వ్యక్తివి. దేవునికి యిష్టానుసారమైన వ్యక్తిగ నీవు జీవించుచున్న యెడల నిన్ను అనేక రీతులుగ దేవుడు దీవించును. నీవు యెట్టి విధంగా జీవించవలెనని దేవుడు కోరుచున్నాడు? క్రైస్తవ స్త్రీలు విడిచి పెట్టవలసిన విషయము లేమిటి? వీటికి జవాబులు బైబిలునందు చూడగలము. దేవుని మాటలు వ్రాతలలో:

## గృహములో క్రైస్తవ స్త్రీ

"అటువలె పరిచర్య చేయు స్త్రీలును మాన్యులై కొండెములు చెప్పువారు కాక, మితానుభవము గలవారును, అన్ని విషయములలో నమ్మకమైన వారునై యుండవలెను. పరిచారకులు ఏక పత్నీ పురుషులును, తమ పిల్లలను, తమ యింటి వారిని బాగుగా ఏలు వారునై యుండవలెను. పరిచారకులై యుండి ఆ పనిని బాగుగా నెరవేర్చిన వారు మంచి పదవిని సంపాదించుకొని క్రీస్తు యేసు నందలి విశ్వాసము నందు బహు ధైర్యము గలవారగుదురు" (1 తిమోతి 2:11-14). ఈ అణకువ యనేది స్త్రీ జీవితమునకు దుర్భరముగ యుండకూడదు. ఎఫెసీ 5:22-23 లో వ్రాయబడిన అంశములను బట్టి మనము గ్రహించ గలిగిన విషయము లేమిటి అనగా క్రీస్తు సంఘమును ప్రేమించిన రీతినే పురుషుడు తన భార్యను ప్రేమింపవలెను. తన స్వంత శరీరమును కాపాడుకొను రీతిని

పురుషుడు తన భార్యను కాపాడి సంరక్షింపవలెను. భార్య అయితే తన భర్తయందు గౌరవము కలిగి యుండవలెను. ఇది ఒక గొప్ప ఆనందదాయకమైన సంబంధము.

తన యింటిని ఒక ఉల్లాసమైన స్థలముగ యుంచు కొనుటకు స్త్రీ పాటుపడవలెను. గృహములను శుభ్రముగను, చక్కగను పెట్టుకొనుట ద్వారాను, బిడ్డలను క్రైస్తవ పద్ధతిలో అనగా ఇతరుల యెడల దయ, కనికరము గలిగి యుండునట్లును, ఇతరులకు క్రైస్తవ మాదిరిని చూపించ గల్గునట్లును బిడ్డలకు తర్ఫీదు నిచ్చుకొనవలెను. “కాబట్టి యౌవ్వన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని, గృహపరిపాలన జరిగించుచు. నిందించుటకు విరోధికి అవకాశ మియ్యకుండ వలెనని కోరుచున్నాను” (1 తిమోతి 5:14). ఇతరులను ఆదరించుట ద్వారా మన భర్తలకు మనము సహాయ పడగలము. దేవుడు మనలను దీవించిన దానిని బట్టి వాటిని యితరులకు వాటిని పంచి యిచ్చుటకు సమ్మతి కలిగి యుండవలెను. ఈ విధముగ చేయుట ద్వారా క్రైస్తవులైన భర్తలు సంఘ నాయకులుగ పరిచర్య చేయుటకు నియమితులు కాగలరు. “అధ్యక్షుడగు వాడు నిందారహితుడును, ఏకపత్నీ పురుషుడును, మితానుభవుడును, స్వస్థబుద్ధి గలవాడును బోధింప తగిన వాడునై యుండి, మద్యపానీయు, కొట్టువాడును కాక, సాత్వికుడును, జగడమాడని వాడును, ధనాపేక్ష లేనివాడునై, సంపూర్ణ మాన్యత కలిగి, తన పిల్లలను స్వాధీన పరచుకొనుచు, తన యింటివారిని బాగుగా యేలు వాడునై యుండవలెను” (1 తిమోతి 2:2-5). “అటువలె పరిచర్య చేయు స్త్రీలును మాన్యులై, కొండెములు చెప్పని వారునై, మితానుభవము గలవారును, అన్ని విషయములలో నమ్మకమైన వారునై యుండవలెను” (1 తిమోతి 3:11).

క్రైస్తవుడు కాని భర్తకు ఒక ప్రత్యేకమైన రీతిలో భార్య సహాయము చేయవచ్చును. నీ భర్త యొక్క ఆధీనములో నీవుండినట్లయినచో నీ క్రైస్తవ

జీవిత విధానము ద్వారా నీ భర్తను నీవు క్రీస్తు కొరకు సంపాదించగలవు. "అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడి యుండుడి అందువలన వారిలో ఎవడైనను, వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తనను చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్ట బడవచ్చును" (1 పేతురు 3-1:2). మాటల కంటె దైవభక్తితో కూడిన ప్రవర్తన ద్వారా మంచి మార్పు తీసుకురాగలము.

అవివాహితులైన స్త్రీలు కూడ తమ వంతు బాధ్యతను గృహములో బాగుగా నిర్వర్తించవలెను. దేవుని ద్వారా మనము పొందిన ఆశీర్వాదములను దేవుని సేవా పరిచర్య చేయువారితో కూడ మనము పంచుకొనిన యెడల వాటిని క్రీస్తుతో కూడ పంచుకొనిన వారమగుదుము. అప్పుడు మనము ప్రవక్త ఫలమును పొందుదుము. "మిమ్మును చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును; నన్ను చేర్చుకొనువాడు నన్ను పంపిన వాని చేర్చుకొనును. ప్రవక్తయని ప్రవక్తను చేర్చుకొనువాడు ప్రవక్త ఫలము పొందును; నీతిమంతుని చేర్చుకొనువాడు నీతిమంతుని ఫలము పొందును. మరియు శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్ళు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగ మీతో చెప్పుచున్నాను" (మత్తయి 10:40-42). మంచి క్రియలు చేయ సమకట్టు వారికి వివాహమే ప్రాముఖ్యము కాదు. అవివాహితులైనను అనేక మంచి కార్యములను చేయుటలో పేరుగాంచిన వారు కాగలరు. "సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగ యుండ వలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువగలది" (1 పేతురు 3:4). "సత్ క్రియలకు పేరు పొందిన విధవరాలు పిల్లలను పెంచి పరదేశులకు ఆతిధ్యమిచ్చి, పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమపడు వారికి సహాయము చేసి, ప్రతి సత్కార్యము చేయబూనుకొన్నదైతే ఆమెను విధవరాండ్ర లెక్కలో చేర్చవచ్చును" (1 తిమోతి 5:10).

వృద్ధ స్త్రీల పనులను గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నది? క్రైస్తవ సేవా పరిచర్యనుండి విరమించుటకు దేవుడు వయ:పరిమాణమును నిర్ణయించలేదు. నీవు నీ శక్తి లోపము లేని సేవ చేయవలెనని దేవుడు ఎప్పుడూ కోరుచున్నాడు. "చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనినైనను నీ శక్తి లోపము లేకుండ చేయుము" (ప్రసంగి 9:10). వృద్ధులైన స్త్రీలు మంచి మాదిరిని కనబరచు వారై యుండవలెను. నీవు క్రీస్తు మాదిరిని అనుసరించు రీతిని యౌవ్వనులైన స్త్రీలు కూడ నీ మాదిరి ననుసరించుచూ, నిన్ను గౌరవించు వారిగా యుందురు. నీవు మంచి మాదిరిని కనబరచు దానివైన యెడల ఈ దిగువన వ్రాయబడిన వాక్య ప్రకారము బోధించుటకు తగిన దానవుగ యుందువు. "వృద్ధ స్త్రీలు కొండెకత్తెలును, మిగుల మద్యపానాసక్తులునై యుండక, ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలెననియు, దేవుని వాక్యము దూషించబడక యుండు నట్లు యౌవ్వన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి, తమ భర్తలను, శిశు వులను ప్రేమించు వారై యుండి, స్వస్థబుద్ధి గలవారును, పవిత్రులును, ఇంట ఉండి పనిచేసుకొనువారును, మంచి వారునై యుండవలె ననియు బోధించుము" (తీతుకు 2:8-5). మనము వయస్సులో పెరుగు చుండగ మనము మేలు చేయుట యందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోయుదుము" (గలతి 6:9). ఈ వాక్యమును జ్ఞాపక మందుంచు కొందము. అప్పుడు తగిన కాలమందు దీవింపబడగలము.

## సంఘములో క్రైస్తవ స్త్రీ

సంఘములో పనిచేయుటకు, ఆరాధించుటకు గాను బైబిల్‌లో కొన్ని సూచనలీయబడినవి. ఆ ఆజ్ఞలలో కొన్ని పాడుట, అది "ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి (ఎఫెసీ 5:19), ప్రార్థించుటకును "అది ప్రతి విషయమందును కృతజ్ఞతా

స్తుతులు చెల్లించుడి. ఈ లాగు చేయుట యేసుక్రీస్తు నందు మీ విషయములో దేవుని చిత్తము". (1 థెస్స 5:17-18). ఇచ్చుటలోను అది "సణుగు కొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించు కొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగ యిచ్చు వానిని ప్రేమించును" (2 కొరింథీ 9:7), ప్రత్యేకించి స్త్రీలైన వారు తీతుకు 2వ అధ్యాయములో మనము చూచిన రీతిని యితర స్త్రీలకును బోధింపవలసిన వారమై యున్నాము.

సంఘములో కొన్ని పనులు ప్రత్యేకించి పురుషుల కొరకు మాత్రమే ఏర్పాటు చేయబడెను. అవి సంఘ పెద్ద, పరిచారకుడు అనునవి. భర్తలైనటువంటి వారు మాత్రమే ఈ కార్యములు చేయవలెనని బైబిలు చెప్పుచున్నది. అది 1 తిమోతి 3:3-13లోను తీతు 1:5-6లలోను చూడగలము. సంఘములో ఆరాధన జరిగించుటకు, నడిపించుటకు, ప్రసంగించుటకు, బోధించుటకు పురుషుడు మాత్రమే చేయవలెను. వానికే అట్టి అధికారము గలదు. స్త్రీలు మౌనముగ యుండి నేర్చుకొనవలసిన వారై యున్నారు. "స్త్రీలు మౌనముగ యుండవలసినదే గాని, ఉ పదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను, అమెకు సెలవియ్యను. (1తిమోతి 2:11-12).

క్రైస్తవ స్రీలు సంఘపనులలో పాల్గొనవలసిన వారై యున్నారు. కాని బైబిలులో వ్రాయబడిన నియమములకు కట్టుబడి పనిచేయ వలసినవారై యున్నారు. నీ జీవితమును గూర్చి దేవుని ఉద్దేశ ప్రకారము నడుచు చుంటివా? నీవు క్రైస్తవురాలివేనా? నీ గృహములో దేవునిని సంతోష పరచు చుంటివా? నీవు సంఘములో దేవునిని సంతోష పరచుచుంటివా? బైబిలు గ్రంథములో క్రైస్తవ స్త్రీని గూర్చి వ్రాయబడిన అంశములు ద్వారా నీ జీవితమును సరి పోల్చుకొని, దేవునిని సంతోష పరచుటకును, ఆత్మీయముగ ఎదుగుటకును ప్రయత్నించుము.

# 10. ప్రజలు యేమి చెప్పదురు?

## (What will people say?)

మనలను గూర్చి ప్రజలు యేమి తలంచు చున్నారనే విషయమును గూర్చి మనము ఆలోచింప వలెనా? క్రైస్తవులైన వారు తమ యొక్క జీవిత విధానములో వారికి గల పేరు ప్రతిష్టలను గూర్చి ఆలోచన కలిగి యుండవలెను. దేవునికి యిష్టమైన రీతిగ మనము యితరుల పట్ల దయ, కనికరము గలిగి నీతిగా జీవించుచున్నట్లయిన అటువంటి గుణగుణములనే ప్రజలు యిష్టపడుదురు. దేవునికి విధేయులమై మనము జీవించుట ద్వారా దేవునికి మహిమ కలిగించుట మాత్రమే గాక ప్రజలకు మనము మంచి మాదిరిని చూపించే వారముగా కూడా యుండగలము. నా జీవితములో యెక్కువ ప్రభావమును చూపిన యిద్దరు క్రైస్తవ స్త్రీల మరణమును గూర్చి ఈ మధ్యనే నేను విన్నాను. వారిని గూర్చిన కొన్ని మాదిరికరమైన విషయములను గూర్చి నేను మీకు చెప్పుటకు యిష్టపడు చున్నాను.

నా భర్తయైన రోయిస్ ఫ్రెడిరిక్ గారు బ్రౌన్ ట్రైల్ స్కూలు ఆఫ్ ప్రీచింగ్ (Brown Trail School of Preaching) నుండి గ్రేడ్యుయేట్ పట్టా 1973లో పొందారు. మొట్ట మొదటిసారిగ ఆయన Morgon Mill, టెక్సాస్‌లో బోధకునిగ నియమితు లైనందున మేము అచ్చటకు వెళ్లవలసి వచ్చినది. అచ్చట ఎలిజిబెత్ డేవీస్ అను వృద్ధురాలు ప్రతి వారమున కొకసారి స్త్రీలకు బైబిలు తరగతులు బోధించేవారు. ఆమెకు బైబిలులో మంచి పాండిత్యము గలదు. ఆమె మాకు మంచి పాఠ్యాంశములు బైబిలు

నుండి సిద్ధపరచి మాకు బోధించే వారు. దేవుని చిత్త ప్రకారము చేయుటకు, వాక్యమును చదువుటకు ఆమెకు బైబిలులో మంచి పాండిత్యము గలదు. ఆమె మాకు మంచి పాఠ్యాంశములు బైబిలు నుండి సిద్ధపరచి మాకు బోధించే వారు. దేవుని చిత్తప్రకారము చేయుటకు, వాక్యమును చదువుటకు నేను ఆమె యొద్ద నుండి చాలా విషయములు నేర్చుకొంటిని. ఒక యౌవ్వనస్థుడైన బోధకుని భార్యగా ఆమెలోని దయ, జ్ఞానము, దాతృత్వము – ఇవియన్నియు నాకు ఎక్కువైన ప్రోత్సాహమును కలిగించినవి. ఆమె యొక్క మంచి నడవడి ఆమె యొక్క కుటుంబములోను, సంఘములోను, ప్రజల మధ్యను ఎంతో మంచిని పెంపొందించెను.

బైబిలులో చెప్పబడిన కొంత మంది స్త్రీలు యొక్క జీవితములు మనకు మంచి మాదిరికరముగ యున్నవి. వారిలో కొంత మంది యొక్క మాదిరి నైనా నీవు అనుకరించు చుంటివా?

**1. క్రీస్తు తల్లియైన మరియ :–** మరియ యౌవ్వనస్థురాలైన కన్యక. ఆమె దీనురాలు మరియు విశ్వాసి, గాబ్రియేలు దూత ఆమెను దయా ప్రాప్తురాలా అని సంబోధించుచూ నీవు దేవుని వలన కృప పొందితివని చెప్పింది (లూకా 11:26–45), యేసు ప్రభువు యొక్క బాల్యమును గూర్చి బాధ్యత ఆమె పొందుటకు నిర్ణయింపబడెను.

**2. దోర్కా (తబిత) :–** దొర్కా యొక్క సత్క్రియలు. ధర్మకార్యములను బట్టి ప్రసిద్ధి కెక్కెను. ఆమె మరణించినపుడు అపొస్తలుడైన పేతురు కొరకు పంపిరి. పేతురు అచ్చటకు వచ్చినపుడు విధవరాండ్రందరు వచ్చి యేడ్చుచు దొర్కా తమతో కూడ యున్నపుడు కుట్టిన అంగీలను, వస్త్రములను చూపుచు అతని యెదుట నిలిచిరి. దేవుని యొక్క మహాశక్తిని బట్టి పేతురు ఆమెను మరణము నుండి లేవనెత్తెను. “అది యొప్పే యందంతట తెలిసినపుడు అనేకులు ప్రభువునందు విశ్వాసముంచిరి” (అపొ.కా. 9:42).

**3. ప్రిస్కిల్ల :–** ప్రిస్కిలయు, ఆమె భర్తయైన అకులయు అపొస్తలుడైన

పౌలును తమ యింటికి ఆహ్వానించి, వానికి ఒక పనిని యేర్పాటు చేసి ఆతిథ్యమిచ్చు చుండిరి. “వారు వృత్తికి డేరాలు కుట్టువారు. పౌలు అదే వృత్తిగలవాడు గనుక వారితో కాపురముండెను. వారు కలసి పనిచేయు చుండిరి”. (అపొ.కా. 18:23). వారు సువార్తను బోధించే వారికి మాదిరి. “ప్రిస్కిల్ల, అకులయు విని, అతని చేర్చుకొని దేవుని మార్గము మరి పూర్తిగ అతనికి విశదపరచిరి. (అపొ.కా. 18:26), “అకుల, ప్రిస్కిల్ల అను వారును, వారి యింట యున్న సంఘమును ప్రభువు నందు మీకు అనేక వందనములు చెప్పుచున్నారు”. (1 కొరింథీ 16:19), అకుల, ప్రిస్కల్లలు వారి యింటి యందే సంఘ సమావేశము యేర్పాటు చేసిరి.

**4. దేవాలయములోని విధవరాలు :-** ఈమె పేరు తెలియ పరచ బడలేదు గాని ఈమె యొక్క సంపూర్ణ సమర్పణ జీవితము మనకు ఒక గొప్ప మాదిరి, ధనవంతురాలైన వారందరు వారి ధన సమృద్ధిని నుండి కానుక పెట్టెలో వేయుచుండగా ఈ విధవరాలు మిక్కిలి తక్కువైన విలువ గల రెండు కాసులు మాత్రమే కానుక పెట్టెలో వేసెను. ఆమె వేసిన కానుక దేవుని దృష్టిలో చాల విలువైనదిగ యుండెను. యేసు ప్రభువు ఆమెను గూర్చి ఈ మాట చెప్పెను. “కానుక పెట్టెలో డబ్బులు వేసిన వారందరి కంటే ఈ బీద విధవరాలు ఎక్కువ వేసెనని మీతో నిశ్చయముగ చెప్పు చున్నాను. వారందరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి వేసిరిగాని, ఈమె తన లేమిలో తనకు కలిగినదంతయు, అనగా తన జీవన మంతయు వేసెనని చెప్పెను”.

**5. మార్త, లాజరుల యొక్క సహోదరియైన మరియ:-** యేసును సిలువ వేయుటకు సమయము సమీపించు చుండిన ఒక దినమందు బేతనియ లోని సీమోను యింట యేసు భోజనమునకు కూర్చుండెను. వారు భోజనము చేయుచుండినపుడు మరియ వచ్చి మిగుల విలువ గల అత్తరుతో ఆయనకు అభిషేకించెను. అంత ఎక్కువైన విలువ గల అత్తరును ఆ విధముగ వ్యర్థపరచి నందుకు శిష్యులామెను గద్దించిరి. అయితే యేసు

ఈ విధముగ చెప్పెను. "ఈమె జోలికి పోకుడి. ఈమెను ఎందుకు తొందర పెట్టుచున్నారు? ఈమె నా యెడల మంచి కార్యము చేసెను. బీదలు యెల్లప్పుడు మీతోనే యుందురు. మీ కిష్టమైనప్పుడెల్ల వారికి మేలు చేయవచ్చును. నేనెల్లప్పుడు మీతోయుండను. ఈమె తన శక్తి కొలది చేసి, నా భూస్థాపన నిమిత్తము నా శరీరమును ముందుగా అభిషేకించెను. సర్వలోకములో యెక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసి నదియు జ్ఞాపకార్థముగ ప్రశంసింప బడునని మీతో నిశ్చయముగ చెప్పుచు న్నాననెను" (మార్కు 14:3–9), యోహాను12:1–8 కూడ చదువవలెను. ఆమె చేయగలిగిన దేదో ఆమె నా కొరకు చేసినదని యేసు చెప్పెను. దేవుడు మనలో ప్రతి ఒక్కొక్కరికి బహుమానములు ఇచ్చి యున్నాడు. మనందరకు ఒకే విధమైన శక్తి సామర్థ్యము లుండవు కాని మనకీయబడిన వరములతో కొంత పనిని చేయగలము (రోమా 12:8–8).

మనలో ఒక్కొక్కరికి ఈయబడిన తలాంతులు లేక వరములు యేమిటో మనము జాగ్రత్తగ పరిశీలించుకొని ప్రభువు సేవలో వాటిని వినియోగించుట ద్వారా ఆ వరములను అభివృద్ధి చేసికొనవలెను. మీరు ఆతిథ్యము యిచ్చుట నేర్చుగలవారు కావచ్చును. ఆలాగుననే బోధించుటలోను, కుట్టుటలోను, బిడ్డలను పెంచుటలోను నిపుణత కలిగి యుండవచ్చును. దీనత్వము కలిగి త్యాగపూరితమైన సమర్పణ కలిగి యుండవచ్చును. వ్రాయుటలోను, హెచ్చరించుట యందును నీకు ప్రావీణ్యము కలిగి యుండవచ్చును. నీ తలాంతులు యేమైనప్పటికిని, వాటిని నీవు దయచేసి పరిచర్యలో ఉప యోగించినపుడు, "ఆమె చేయగలిగినది ఆమె చేసెనని" ప్రభువు నిన్ను గూర్చి కూడ చెప్పును.

ఈ జీవితమును నీవు ముగించు కొనినపుడు నిన్ను యేవిధముగ జ్ఞాపకము చేసికొనవలెనని నీవు కోరుచున్నావు? నిన్ను గూర్చి ప్రజలు యేమి చెప్పుదురు? ప్రాముఖ్యముగ తీర్పు దినమున యేసు నిన్ను గూర్చి యేమి చెప్పును?

# 11. దేవుని సంతోషపరచునదేది?

## (What pleases God?)

దేవునిని సంతోషపరచుటకు మానవులు చేసిన అనేకమైన ప్రయత్న ములతో మానవ చరిత్ర నిండి యున్నది. అట్టి ప్రయత్నములలో కొంత మంది సఫలులైరి, మరికొంత మంది విఫలులైరి.

లోకమును సృజించిన కొన్ని సంవత్సరముల తరువాత యిద్దరు సోదరులు దేవునికి బలులు అర్పించారు. వారిలో హేబెలు తాను అర్పించిన బలి ద్వారా దేవునిని సంతోషపరచెను. మరియొక సహోదరుడు కయీను తాను. అర్పించిన బలి ద్వారా దేవునిని సంతోష పరచలేక పోయెను (ఆది కా. 4:7, 8).

ఇశ్రాయేలీయులలో మొదటి రాజైన సౌలు దేవుని శత్రువులైన అమాలేకీయులను ఒక యుద్ధమందు ఓడించెను. సౌలును, అతని పరివారమును ఆమాలేకీయుల పశువులలో మంచి వాటిని నిర్మూలము చేయక దేవుని బలి అర్పించుట కొరకు వాటిని మిగిల్చిరి. ఈ కార్యము దేవునికి ఎంతో ఎక్కువైన సంతాపము కలుగజేయుట వలన సౌలు చేతి నుండి ఆయన రాజ్యమును తీసివేసెను.

రాజైన దావీదు కాలములో దేవుని మందసము గిబియా నుండి ఒక బండి మీద తీసుకురాబడెను. బండిని నడుపుచున్న వారిలో ఉజ్జా అను నతడు ఎద్లకు కాలు జారినందున దేవుని మందసమును చేతితో

పట్టుకొనెను. ఈ కార్యము దేవునికి అయిష్టతను కలిగించెను గనుక ఉజ్జా అక్కడనే దేవుని మందసము నొద్ద పడి చనిపోయెను (11 సమూయేలు 6:3, 7).

ఈ భూమి మీద యేసు ఆయన సంఘమును స్థాపించిన తరువాత సంఘ సభ్యులందరు వారికి కలిగిన ఆస్తులన్నిటిని సమిష్టిగా అనుభవించు చుండిరి. భూములైనను, ఇండ్లయినను కలిగిన వారందరు వాటిని అమ్మి, వాటి సొమ్మును అపొస్తులుల ద్వారా ఎవరి అక్కరకొలది వారికి పంచి యిచ్చుచుండిరి. అననీయ, సప్పీరా అను యిరువురు భార్యభర్తలు వారికి కలిగిన పొలమును అమ్మి దాని వెలలో కొంత సొమ్మును అపొస్తులుల యొద్దకు తీసికొని వచ్చిరి. ఈ విధముగ చేయుట దేవునికి అయిష్టతను కలిగించి నందున వారివురును మరణించుటకు కారణమైనది (అపొ.కా. 4:34, 5:10).

క్రీస్తు సంఘము యింకను బలపడక ముందే కొంత మంది యూదులు క్రైస్తవులను హింసించుటకు ప్రారంభించిరి. వారిలో తార్సు వాడైన సౌలు వారి గృహములలోనికి వెళ్ళి, వారిని బంధించి, చెరసాలలో వేయించు చుండెను. ఈ విధముగ చేయుట దేవుని చిత్తమని అతడు నమ్మి ఆలాగు చేయుచుండెను. తన పనులు, ప్రయత్నములు మానుకొనుమని, వాటిని మార్చుకొనుమని పరలోకము నుండి యేసు ప్రభువే మాట్లాడి మూడు దినముల మట్టుకు సౌలును గ్రుడ్డి వానిగ చేసెను (అపొ. కా. 9:1–9).

ఈ పై ఉదాహరణలను మనము గమనించుచు ఇప్పుడు దేవునిని సంతోష పరచుట సాధ్యమేనా? అనే భావన కలుగును. మానవ జ్ఞానమును బట్టి చూచిన యెడల ఈపై అంశము లన్నింటిని బట్టి దేవుడు సంతోషించి యుండవలసిన అభిప్రాయము మనకు కలుగును. వారు కూడ వారి క్రియలను బట్టి దేవుడు సంతోషించి యుండుననే అభిప్రాయమే కలిగి.

యుండవచ్చును. వారి వారి క్రియల వలన దేవుని సంతోష పరచలేక పోయిరని వారికెట్లు తెలియును? దేవునిని యెట్లు సంతోష పరచగలమో మనకెట్లు తెలియును?

దేవునికి మనము విధేయుల మగుట ద్వారా దేవునిని సంతోషపరచ గలమనే విషయము మనకు తెలియును (యిర్మియా 7:28; 1 సమూయేలు 15:22, అపొ.కా. 5:29). ఈ విషయము మనము మనస్సునందుంచు కుని పైనుదహరించిన విషయములను మరి యొకసారి పరిశీలించెదము.

హేబెలు అర్పించిన బలి దేవుని యొక్క ఆజ్ఞ ప్రకారము అర్పించబడెను. ఆ బలి విశ్వాసమును బట్టి అర్పింపబడెను. దేవుని వాక్యము వినుట ద్వారా విశ్వాసము కలుగును. (హెబ్రీ 11:6; రోమా 10:17).

నోవహు, అతని కుటుంబము జలప్రళయము నుండి రక్షింపబడిరి. ఎందుకనగా, నోవహు దేవునికి విధేయుడై ఆయన మాట ప్రకారము ఓడను నిర్మించెను (హెబ్రీ 11:17).

రాజైన సౌలు అమాలేకీయుల పశువులలో మంచి వాటిని బలి అర్పించుటకు ఉంచుట ద్వారా దేవునికి అవిధేయుడయ్యెను. అమాలేకీయుల సంబంధించిన దానిని దేనినైనను సర్వనాశనము చేయుమని సౌలు రాజుకు దేవుడాజ్ఞాపించెను (1 సమూయేలు 15:31).

దేవుని మందసమును ఉజ్జా పట్టుకొనుట ద్వారా ఉజ్జా దేవుని అజ్ఞను అతిక్రమించెను. మందసమును వేరొక ప్రదేశమునకు తరలించుటకు దేవుని చేత యేర్పాటు చేయబడిన వారిలో ఉజ్జా ఒకడు. పరిశుద్ధమైన దానిని ముట్టకూడదని దేవుని ఆజ్ఞ కలదు (సంఖ్యా 4:15).

అనసీయ, సప్పీరాలు వారికి కలిగిన ఆస్తిని అమ్మి అవసరతలలో యున్న వారికి సహాయము చేయుట వలన వారు మరణించలేదు. కాని

వారికి కలిగిన సొమ్ము నంతటిని పూర్తిగా యిచ్చితిమని బొంకుట వలన వారు దేవునికి అవిధేయులైరి (సామెతలు 6:16-19; లుకా 18:20; మత్తయి 12:37).

తార్సువాడైన సౌలు దేవుని చిత్తప్రకారము చేయుట లేదని తాను గ్రహించిన వెంటనే తన జీవిత విధానమును మార్చుకుని తన శేష జీవితమును నంతయు దైవ చిత్తానుసారముగ జీవించెను (అ.పొ.కా. 9:1-30; 1తిమోతి 4:6-8).

అనేక మంది దేవునిని సంతోషపరచ తలంచెదరు కాని దేవునిని సంతోషపరచుట యెట్లో వారు గ్రహింపరు. వారి దృష్టికి మంచి అని తలంచినదంతా దేవునికి అంగీకారమేయని తలంచెదరు. వారు దేవుని యందు ఆసక్తి గలవారే కాని అది జ్ఞానానుసారమైనది కాదు. వారు దేవుని నీతి నెరుగక తమ స్వనీతి నాధారము చేసికొని దేవుని నీతికి లోబడ లేదు (రోమా 10:2,3). దేవుని వాక్యమైన బైబిలును చదివి దేవునిని యెట్లు సంతోషపరచగలమో తెలుసుకొని అట్టి విధముగ చేస్తే దేవునిని సంతోష పరచుచున్నామని మనము తెలిసికొనగలము.

# రెండవ భాగము



# కొనియాడదగిన దేవుని స్త్రీ

## (The Woman Worthy of Praise)

# 12. కొనియాడ దగిన స్త్రీ

## (The Woman Worthy of Praise)

స్త్రీలలో అనేకమంది వారిని పొగడుచుండుటకు యిష్టపడుదురు. కొంత మంది విలువైన దుస్తులను, నగలను కొనుటకు ఎంతో ధనమును వెచ్చిస్తారు. కొంతమంది సౌందర్య సాధనములైన సుగంధ సంబారములకు, కేశాలంకరణ మున్నగు వాటి కొరకు తమ సమయము నంతా వెచ్చించెదరు. మరికొంత మంది అయితే తమ నిపుణతను చాటి చెప్పే విధముగ గృహములను అలంకరించు కొనుట యందును లేక మంచి విందులు చేయుటకును తమ సమయము గడుపుదురు. ఇవన్నియు కూడ మనుష్యులు మనలను ప్రసిద్ధి చేయుటకు కారణమగును గాని దేవుని నుండి ఘనత పొందుటకు కారణమగునా? పరిశుద్ధ గ్రంథమైన బైబిలు ద్వారా దేవుని నుండి మనము ఘన పరచబడు విధానమును తెలిసికొనగలము. వాటిలో కొన్నింటిని ఈ దిగువనీయ బడిన అంశముల ద్వారా తెలిసికొందము.

బాహ్యాలంకరణ కొరకు ఎక్కువగ ఆలోచించే వారిని గూర్చి పరిశుద్ధ గ్రంథములో ఈ విధముగ వ్రాయబడి యున్నది. “జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగ యుండక, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమును అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగ యుండవలెను.” అది దేవుని దృష్టికి మిగులు విలువగలది (1 పేతురు 3:3-4). విలువైన వస్త్రధారణ,

జడలు అల్లుకొనుట, బంగారు నగలు ధరించుటకంటే, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన హృదయమును దేవుడు కోరుచున్నారు. మన బాహ్యాలంకరణ ద్వారా దేవుని నుండి మనము ఘనత పొందలేము కాని నీతి గల హృదయమనే అక్షయాలంకరణమునే దేవుడు కోరుచున్నారు. దేవుని జనాంగమైన ఇశ్రాయేలీయులకు రాజును యేర్పాటు చేయు విషయములో ఆయన ప్రవక్తయైన సమూయేలుతో దేవుడీ విధముగ చెప్పుచున్నారు: "మనుష్యులు లక్ష్యపెట్టు వాటిని యెహోవా లక్ష్యపెట్టడు. మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1సమూయేలు 16:7).

జీవితములోని అత్యంత ప్రాముఖ్యమైన విషయములను అశ్రద్ధ చేసి సౌందర్యమైన గృహాలంకరణ, రుచికరమైన విందులు ద్వారా దేవుని యొక్క మెప్పును మనము పొందలేము. యేసు ప్రభువు ఈ భూలోకములో యున్నప్పుడు మార్త యొక్క గృహములో బోధించెను. మార్త ఆయనకు పరిచర్య చేయుటలో నిమగ్నమై ఆయన బోధను వినుటకు శ్రద్ధ వహించలేదు. ఆమె సోదరి మరియ ఆయన బోధను శ్రద్ధగా వినుచుండెను. తనకు పనిలో సహాయము చేయుమని మరియతో చెప్పుమని మార్త ప్రభువుతో చెప్పెను. అప్పుడు ప్రభువు మార్తతో, "మార్తా నీ వనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు. కాని అవసరమైన దొక్కటే. మరియ ఉత్తమమైన దానిని యేర్పరచుకొనెను. అది ఆమె యొద్దనుండి తీసివేయ బడదని ఆమెతో చెప్పెను" (లూకా 10:41-42). ఆత్మీయ విషయములకే యెక్కువ ప్రాధాన్యత నీయవలెనని ప్రభువు కోరుచున్నారు.

అలంకారమైన దుస్తులు ధరించుట, మన గృహములు ఆనంద దాయకముగ యుండుటకు మనము ప్రయాసపడిన పని చేసికొనుట తప్పుకాదు. కాని మన స్వకీయ, గృహ విషయములను గూర్చి జాగ్రత్త

కలిగి యుండవలెనని దేవుడు కోరుచున్నాడు. ఇది సామెతలు 31:10-27 లలో మనకు విపులముగ తెలియజేయబడినది. ఈ విషయములన్నియు మనుష్యుల మెప్పు నాశించుట కొరకు చేయుట కాదు గాని మన నీతి ప్రవర్తన ద్వారా దేవుని మహిమ కొరకై దేవుని యొద్దకు అనేకులను రాబట్టుట కొరకు చేయవలెను. “మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి” (మత్తయి 5:16). అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము. యెహోవా యందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును” (సామెతలు 31:80) అని జ్ఞానియైన సొలోమోను వ్రాసిన సామెతలలో మనము చదువగలము.

# 13. శారా యొక్క విశ్వాసము

## (Sarah's Faith)

తమ జీవిత విధానము ద్వారా దేవునిని సంతోష పరచిన స్త్రీ పురుషులను గూర్చి దైవ గ్రంథములో మనము చూడగలము. వారి యొక్క జీవితాను భవములను బట్టి మనము కూడా దేవునిని సంతోషపరచే విధమును నేర్చుకొనవలెను. దేవునిని సంతోషపరచుటలో గల మొదటి మెట్టు విశ్వాసమును అభివృద్ధి చేసుకొనుట. విశ్వాసము లేకుండా దేవునిని సంతోషపరచుట అసాధ్యము. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయున యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా" (హెబ్రీ 11:6). దేవుని యందలి మన విశ్వాసముతో యింకను పొందుపరచవలసిన దేమిటి? దేవుని యందు గొప్ప విశ్వాసము గలిగిన యొక స్త్రీని బైబిలు గ్రంథము నుండి పరిశీలించుదము.

దేవుని యొక్క వాగ్దానము గూర్చి శారా నమ్మెను. అబ్రహాము శారాలకు ఒక కుమారుడు కలుగుననియు, వాని ద్వారా భూమి మీద అతని సంతానము విస్తరింపబడుననియు దేవుడు వారికి వాగ్దానము చేసెను (ఆది.కా 18:16). భూమి యొక్క సమస్త వంశములు నీ యందు ఆశీర్వదింపబడునని కూడ దేవుడు అబ్రహాముకు వాగ్దానము చేసెను (ఆది.కా. 12:8). కాలము గడచు చుండెను గాని శారాకు పిల్లలు కలుగలేదు. ఆమె గొడ్రాలుగ యుండెను. శారా యొక్క వృద్ధాప్యమందు

దేవుడు తన యొక్క వాగ్దానమును తిరిగి జ్ఞాపకము చేసెను (ఆది.కా. 18:10). శారా ఈ వాగ్దానమును తిరిగి వినినప్పుడు తన హృదయములో నవ్వు కొనెను. అయితే "యెహోవాకు అసాధ్యమనది యేదైన నున్నదా?" అని దేవుడు అబ్రహాముతో చెప్పెను. (ఆది.కా. 18:14). దేవుని యొక్క వాగ్దాన ప్రకారము వారి కుమారుడైన ఇస్సాకు జన్మించెను (ఆది.కా. 21:21). విశ్వాసమును బట్టి శారాయు వాగ్ధానము చేసిన వాడు నమ్మదగిన వాడని యెంచుకొనెను. కనుక తాను వయస్సు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తి పొందెను (హెబ్రీ 11:11). శారాకు దేవుని వాగ్ధానము యెడల విశ్వాసము గలదు.

పరిశుద్ధ గ్రంథములో దేవుని యొక్క వాగ్దానములెన్నియో మన కొరకు వ్రాయబడెను. క్రీస్తు యొక్క జననమును గూర్చి పాత నిబంధన (గ్రంథములో యెన్నో ప్రవచనములున్నవి. ప్రపంచములోని జనములన్నిటికి కారకుడైన క్రీస్తు కూడ అబ్రహాము, శారాల వంశము నుండియే జన్మించెను. మన ప్రభువైన యేసు ఈ భూలోకములో మానవునిగ జన్మించి, పరిశుద్ధ జీవితము జీవించి, ఆయన మన పాపముల కొరకు పరిశుద్ధమైన బలిగా అర్పింప బడుట ద్వారా దేవుడు తన వాగ్ధానమును నెరవేర్చుకొనెను. క్రైస్తవ జీవితము జీవించు వారికి పాపక్షమాపణ, నిత్య జీవము కలుగునని ఆయన వాగ్ధానము చేసెను. ఈ వాగ్ధానములు దేవుని కుమారుడైన యేసు ప్రభువును రక్షకునిగ నమ్మి ఆయనకు విధేయులైన వారికి అనుగ్రహింపబడును. "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింప బడును" (మార్కు 16:16). శారా యొక్క విశ్వాసమును బట్టి దేవుడు తన వాగ్ధానమును నెరవేర్చు కొనెను. మనము కూడ అట్టి విశ్వాసమును కలిగి యున్నచో ఆయన మనకు చేసిన వాగ్ధానమును కూడ నెరవేర్చును.

# 14. ఇస్సాకు కొరకు దేవునిచే యేర్పాటు చేయబడిన రిబ్కా

## (Rebekah, God's Choice for Issac)

ప్రపంచ మంతటిలోను ప్రతిదినము వందల కొలది తమ భాగస్వాములను యేర్చరచు కొనుచుందురు. భాగస్వాములను యేర్పరచు కొనుటలో వివిధ రకములైన అలవాట్లు, ఆచారము లుండును. ప్రజలలోని కొన్ని జాతుల వారికి ఒక విధమైన ఆచారములు వాడుకలో యుండినట్లయిన, మరియొక తెగ వారికి అవి ప్రాముఖ్యమైనవిగ యెంచబడవు. దేవుని దృష్టిలో ప్రాముఖ్యముగ యెంచబడె గుణము లేమిటో యనే తలంపు, ఆలోచన యెప్పుడైనా నీకు కలిగినదా? బైబిలులోని పాత నిబంధన గ్రంథము ఆదికాండములో దేవుడు ఇస్సాకు యొక్క భార్యను యేర్పాటు చేసిన విధమును మనము తెలిసికొనగలము.

ఈ విషయము ఆదికాండము 24వ అధ్యాయములో వ్రాయబడినది. అబ్రహాము కుమారుడైన ఇస్సాకునకు భార్య అవసరము. ఇస్సాకు కొరకు భార్యను వెదకుటకు నమ్మకస్థుడైన సేవకుని అబ్రహాము పంపించినపుడు అతనికి 140 సం॥లు. అబ్రహాము తన సేవకునితో “నా స్వదేశమందున్న నా బంధువుల యొద్దకు వెళ్ళి ఇస్సాకను నా కుమారునికి భార్యను తీసుకుని రమ్ము. పరలోకపు దేవుడగు యెహోవా తన దూతను నీకు ముందుగా పంపును. అక్కడ నుండి నీవు నా కుమారునికి భార్యను తీసుకుని వచ్చెదవు”. (ఆది.కా. 24:4-7).

ఆ సేవకుడు ఈ కార్యమును చాల కష్టతరమైనదిగా ఎంచుకొనెను. అతను నా హోరు పట్టణమునకు చేరుకొని నపుడు అచ్చట దేవుని నడిపింపు కొరకును, దేవునిచే యేర్పరచబడిన వ్యక్తిని గూర్చిన గుర్తు కొరకును దేవునికి ప్రార్ధన చేసెను. "చిత్తగించుము, నేను ఈ నీళ్ళ ఊట యొద్ద నిలుచు చున్నాను. ఈ ఊరి పిల్లలు నీళ్ళు చేదుకొనుటకు వచ్చుచున్నారు. కాబట్టి నేను త్రాగునట్లు దయచేసి నీవు నీ కడవను పంచుమని చెప్పగా నీవు త్రాగుము, నీ ఒంటెలకును నీళ్ళు పెట్టెదనని యే చిన్నది చెప్పెనో ఆమెయే నీ సేవకుడైన ఇస్సాకు కొరకు నీవు నియమించినదై యుండును గాక" (ఆది.కా. 24:13-14) అని ప్రార్థించెను. అతడు మాటలాడుట ముగింపక ముందే అబ్రహాము సహోదరుని మనుమరాలైన రిబ్కా ఆ బావి యొద్దకు వచ్చెను. ఆ సేవకుడు దేవునికి ప్రార్థించిన విధముగ రిబ్కా ప్రవర్తించెను. తన యజమానుని కుమారుడైన ఇస్సాకునకు దేవుడేర్పరచిన భార్య రిబ్కాయే యని ఆ సేవకుడు గ్రహించెను. దేవుని చేత యేర్పాటు చేయబడిన స్త్రీయైన రిబ్కా యొక్క ప్రవర్తనను గూర్చి కొంత పరిశీలించుదము.

మొట్ట మొదటిగ దేవుని యందు భక్తి, విశ్వాసములు గల కుటుంబ ములో నుండి రిబ్కా వచ్చెను (ఆది.కా. 24:50-51). తన స్వజనులలో నుండియే తన కుమారుడైన ఇస్సాకునకు భార్యను తీసుకొని రమ్మని అబ్రహాము తన సేవకునికి చెప్పుట కిదియొక కారణము కావచ్చును. ఈ దినములలో ఒక క్రైస్తవ వ్యక్తి తనకు సాటియైన సహాయమును యేర్పరచు కొనునపుడు అది తప్పక ఒక క్రైస్తవ వ్యక్తి మరియొక క్రైస్తవ వ్యక్తినే వివాహము చేసికొనిన యెడల వారు విగ్రహారాధనకు లోనుకారు. తన స్వంత యిష్ట ప్రకారమే క్రైస్తవ వ్యక్తి తన జీవిత భాగస్వామిని ఎంచుకొని నట్లయితే అది క్రీస్తునందు సహోదరత్వము కలిగినదై యుండవలెను (1కొరింధి 9:5).

రెండవదిగ రిబ్కా కన్యక, ఏ పురుషుడును ఆమెను కూడలేదు (ఆది.కా. 24:16). నైతికముగ రిబ్కా తన వివాహమునకు ముందుగా చాలా మంచిగ యుండెను. ఈ దినములలో కూడ దేవుడు మనలను ఆ విధముగ యుండ వలెనని కోరుచున్నారు. వివాహము అన్ని విషయములలోను ఘనమైన దిగాను, పానుపు నిష్కల్మషమైనదిగాను యుండవలెను. వేశ్యాసంగులకును, వ్యభిచారులకును దేవుడు తీర్పు తీర్చును (హెబ్రీ 13:4).

మూడవదిగ రిబ్కా అతిథి సత్కార్యము చేయుటలో మంచి నేర్పరి. ఆమె సోమరికాదు ఆమె గృహములో చాలమంది పనివారు ఉండినప్పటికిని పనులన్నీ వారే చేయవలెనన్న తాత్పర్యము రిబ్కాకు లేదు (ఆది.కా. 24:59-61). అబ్రహాము సేవకుడు రిబ్కాను మొదటిగ కలుసుకొనినపుడు రిబ్కా తన కడవ నిండుగ నీళ్లు తీసికొని పోవుచుండెను. ఆ సేవకునికి తన కడవలోని నీరు యిచ్చిన తరువాత ఆమె నీ ఒంటెలకును అవి త్రాగు మట్టుకు నీళ్లు చేది పోయుదునని చెప్పెను (24:19). దాహముతో యుండిన పది ఒంటెలకును నీళ్లు చేది పోయుట సామాన్యమైన విషయము కాదు. నీ తండ్రి యింట ఈ రాత్రి మేము బస చేయుటకు స్థలమున్నదా యని ఆ సేవకుడు రిబ్కాను అడిగినపుడు ఆమె మా దగ్గర చాల గడ్డియు, మేతయు రాత్రి బసచేయుటకు స్థలమును ఉన్నవని చెప్పెను. ఈ విషయములు చెప్పుటకు త్వరగా తన యింటికి పరుగెత్తి వెళ్లి తన యింటి వారికి చెప్పెను.

గృహిణులకు యింటిలో చాల పని యుండును. "వృద్ధులు మితాను భవము గల వారును, మాన్యులును, స్వస్థబుద్ధి గలవారును, విశ్వాస, ప్రేమ, సహనముల యందు లోపము లేనివారై యుండ వలెననియు, ఆలాగుననే వృద్ధ స్త్రీలు కొండెకత్తెలును, మిగుల మద్యపానాసక్తులునై యుండక, ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండ వలెననియు, దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు యౌవ్వన స్త్రీలు తమ భర్తలకు

లోబడి యుండి, తమ భర్తలను, శిశువులను ప్రేమించు వారై యుండి, స్వస్థ బుద్ధి గల వారును, పవిత్రులును, ఇంట ఉండి పనిచేసుకొను వారును, మంచి వారై యుండవలెనని బుద్ధి చెప్పుచు మంచి ఉపదేశము చేయువారునై యుండవలెననియు బోధించుము" (తీతు 2:3-5). అతిధులను ప్రేమతో ఆహ్వానించి సత్కరించే మంచి భార్యను ఇస్సాకుకు దేవుడు అనుగ్రహించెను.

నీవు కూడ దేవునికిని, నీ భర్తకును యిష్టురాలవుగ యుండ గోరిన యెడల రిబ్కా యొక్క మంచి మాదిరిని అనుసరించుము. 1) దేవునిని ఆరాధించి, సేవించుటలో నీ భర్తకు సహకారివై యుండుము. 2) నీ భర్తకు నమ్మకస్థురాలైన భార్యగ యుండుము. 3) సోమరిగ యుండక సత్కారము చేయుటకు వెనుదీయ వద్దు.

# 15.దేవుని అత్యున్నత శక్తి

## (The Providence of God)

విశ్వాసులైన స్త్రీ, పురుషులతో దేవునియొక్క వ్యవహారములను గూర్చి మనము పాత నిబంధన గ్రంథములో అనేకములు చూడగలము. వారి యొక్క మాదిరి ననుసరించి మనము నేర్చుకొనవలెనని క్రొత్తనిబంధన గ్రంథములో హెచ్చరింప బడితిమి. “ఏలయనగా ఓర్పు వలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి” (రోమా 15:4).

యాకెబెదుకు దేవుని అత్యున్నత శక్తి యందు నమ్మిక గలదు. విశ్వాసులైనట్టి వారికి దేవుడు సమస్తము సమకూర్చునని ఆమెకు తెలియును. ఐగుప్తు దాసత్వము నుండి ఇశ్రాయేలీయులను విడిపించుకొని వచ్చుటకు నాయకత్వము వహించిన మోషే యొక్క తల్లి ఈ యాకెబెదు (నిర్గమ 6:20). మోషే జన్మించు సమయమునకు ఒక కఠినమైన ఆజ్ఞ అమలులో యుండెను. ఐగుప్తు రాజైన ఫరో ఇశ్రాయేలీయుల యొక్క ప్రతి మగ బిడ్డ నదిలో పారవేయ బడవలెననెడి కఠినమైన ఆజ్ఞను విధించెను. అయితే ఫరో–హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయుడి, ప్రతి కుమార్తెను బ్రతుక నీయుడి అని ఆజ్ఞపించెను (నిర్గమ 1:22). కాని మోషే యొక్క తల్లి మూడు నెలలు వరకు ఐగుప్తీయులకు కనబడకుండ ఆమె యింటిలోనే మోషేను దాచి పెట్టెను. ఆపై యిక ఆమె వానిని దాచ

లేక జమ్ము పెట్టెలో మోషేను పెట్టి ఆ నది యొద్దనే మోషేను ఉంచిన ఆ పెట్టెను దాచెను. ఫరో యొక్క కుమార్తె ఆ నదికి స్నానమునకై వెళ్ళినపుడు ఆ పెట్టెలో యున్న మోషేను కనుగొనెను. ఆ బిడ్డను చూచి, ఆ బిడ్డ యేడ్చు చుండుటను విని ఆమెకు వాని యెడల దయ కలిగెను. ఆ పిల్లవాని చూచినపుడు ఆ పిల్లవాడు ఏడ్చుచుండగా చూచి వానియందు కనికరించెను (నిర్గమ 2:6). అప్పటి నుండి మోషే పెరిగి పెద్దవాడగు వరకు ఫరో కుమార్తె యొక్కకాపుదలలోనే యుండెను. ఫరో యొక్క జనులెవ్వరును మోషేకు ఏ హానియు చేయుటకు సాహసించలేదు. మోషే యొక్క తల్లితండ్రుల విశ్వాసమును బట్టియే వారు మోషేను ఆ విధముగ దాచిపెట్ట గలిగిరని మనము హెబ్రీ 11:28లో చూడగలము. అది మోషే పుట్టినపుడు అతని తల్లిదండ్రులు ఆ శిశువు సుందరుడై యుండుట చూచి, విశ్వాసమును బట్టి రాజాజ్ఞకు భయపడక, మూడు మాసములు అతనిని దాచిపెట్టిరి. దేవుడు ఆ బిడ్డ విషయము జాగ్రత్త తీసికొనునని ఆ తల్లిదండ్రులు విశ్వసించిరి.

క్రైస్తవులుగా యుండిన వారందరు దేవుని యొక్క అపారమైన శక్తిపై ఆధారపడవలసిన వారమైయున్నారు. “మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును” (మత్తయి 6:38). ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో యని చింతింపవద్దని ఆ పై వచనములలో ఆయన చెప్పి యున్నారు. మన అవసరతలు అన్నియు ఆయనకు తెలియును గనుక ఆయన మనలను గూర్చి జాగ్రత్త వహించును. కొన్ని సార్లు కొన్ని భయంకర విషయములు మనకు సంభవింపవచ్చును. అయితే వాటి నుండి మనము యే మేలును మంచిని పొందగలమో అది దేవునికి తెలియును. “దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము”

(రోమా 8:28). ఈ వచనములలో మనము గమనించి నట్లయిన దేవుడు మనల నుండి యేదో యొకటి కోరుచున్నాడని గ్రహించగలము. ఆయన రాజ్యమును మనము వెదకి నట్లయిన మనము “యేర్పరచ బడిన వారము” (అదే సంఘము) అని గ్రహించగలము. అప్పుడు మనము మన కొరకును, మన కుటుంబముల కొరకును దేవుని యొక్క అద్వితీయ శక్తి పై ఆధారపడి యుండవలెను.

స్త్రీలమైన మనందరకు దేవుని అత్యున్నత శక్తిపై ఆధారపడిన యాకెబెదు మనకు ఒక గొప్ప మాదిరి.

# 16, సమరయ స్త్రీయొక్క ప్రాబల్యము

## (A Samaritan Woman's Influence)

**(యోహాను 4:1-42)**

ఈ భూమిపై యుండే ప్రతి వ్యక్తి ఏదో ఒకరిని ప్రభావితము చేయును. కొంత మంది వారి యొక్క పేరు, ప్రఖ్యాతులను బట్టి, మరి కొంత మంది వారి యొక్క పదవులు, స్థితిని బట్టి అనేకులను ప్రభావితులనుగా చేయుదురు. కొంతమంది వారికి గల వ్యక్తిగత పరిచయములను బట్టి ప్రభావితులు కాగలరు. ప్రతి వ్యక్తి మరియొక వ్యక్తి యొక్క జీవితమును ప్రభావితము చేయగలదని మనము తలంచి నప్పుడు వ్యక్తిగత పరిచయము ద్వారా యెక్కువైన ప్రభావితులు కాగలరు. ఉదాహరణకు, నా కుమార్తె నా ద్వారా ప్రాబల్యము పొందినదై నేనెన్నడును చూడని తన తోటి వారిపై తాను పొందిన ప్రాబల్యమును ప్రదర్శించునట్లు చేయును. ఇది యదార్థము. కనుక మనము మన ప్రవర్తన విషయములో మిక్కిలి జాగరూకులమై యుందుము.

యూదా నుండి గలిలయకు వెళ్ళుటకు యేసు సమరయ మార్గమున వెళ్ళవలసి వచ్చెను. ఆయన విశ్రాంతి కొరకు ఒక నీళ్ళ బావి యొద్ద కూర్చుండగా ఆయన శిష్యులు ఆహారము కొనుటకు ఊరిలోనికి వెళ్ళిరి. యేసు వారి కొరకు కనిపెట్టుచుండగా ఒక స్త్రీ నీళ్ళు చేదుకొనుటకై ఆ బావి యొద్దకు వచ్చెను. యేసు ఆమెను దాహమున కిమ్మని అడిగెను. యూదులు సమరయులు ఒకరితో ఒకరు మాట్లాడుకొనరు గనుక

దాహమున కిమ్మని యేసు ఆమెను అడిగినందున ఆమె చాలా ఆశ్చర్యపడెను. వారిరువురకును కొంత సంభాషణ జరిగిన తరువాత ఆ స్త్రీ ఆయనతో నీవు ఒక ప్రవక్తవని గ్రహించుచున్నానని చెప్పెను. అప్పుడు యేసు ఒక కాలము వచ్చుచున్నది. మీరు ఆరాధించు స్థలము ప్రాముఖ్యము కాదు గాని, దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెనని ఆమెతో చెప్పెను". ఏ మెస్సీయా కొరకు వారు కనిపెట్టుచుండిరో ఆ మెస్సీయాను నేనే అని ఆయన ఆమెతో చెప్పెను. ఆమె ఎంతో ఉద్రేకింపబడినదై తన కుండను ఆ బావి యొద్దనే విడిచిపెట్టి ఊరిలోనికి వెళ్ళి ఆ ప్రవక్తను గూర్చిన విషయమును వారికి తెలియ జెప్పెను. వారిరువురునకు జరిగిన సంభాషణను ఆమె వారికి తెలియజెప్పినపుడు, అనేక మంది సమరయులు ఆ మాటలు నమ్మి యేసును చూచుటకు వెళ్ళిరి. ఆయన వారి యొద్ద ఉండవలెనని వారాయనను బలవంతము చేయగా ఆయన వారితో రెండు దినములు గడిపి వారికి బోధించెను. అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి. నీవు చెప్పిన మాటను బట్టి గాక మా మట్టుకు మేము విని ఈయన నిజముగ లోక రక్షకుడని నమ్ముచున్నామని ఆ స్త్రీతో చెప్పిరి.

ఈ సమరయ స్త్రీ యొక్క ప్రభావము యే రకమైనది? యేసును ఆమె కలసి కొనక పూర్వము ఆమె యొక్క ప్రభావము మంచిగ లేదు. ఆమెను ఎరిగిన వారందరికి ఆమె జీవిత ప్రాబల్యము మంచిదిగ లేదని తెలియును. ఆమె యిది వరకు ఐదుగురిని వివాహము చేసికొనినప్పటికిని ప్రస్తుతము తన భర్తకాని వానితో జీవించు చున్నదని తెలియును. కాని ఆమె యేసును చూచి, ఆయనతో మాట్లాడిన తరువాత ఆమె ప్రాబల్యము మంచిదిగ ప్రభలమయ్యెను. ఆమె యొక్క పాత జీవితము ఆమెను మౌనముగ ఉంచలేక పోయేను. ఆమె యొద్ద ఒక అద్భుతమైన వర్తమానము గలదు. ఆ వర్తమానమును అందరితో పంచుకొనుటకు ఆమె నిశ్చయించు కొనెను. ఆమె చెప్పిన మాటలను బట్టి కొంతమంది వెంటనే యేసునందు

విశ్వాస ముంచిరి. మరి కొంత మంది ఆమె ప్రాబల్యము కంటె యెక్కువగ ఆయన యందు విశ్వాసముంచిరి. సమరయ స్త్రీని బట్టి యేసు వారి యొద్ద ఉండుటకు ఆహ్వానింపబడెను. ఆయన వారి యొద్ద ఉండినపుడు ఎవరైతే ఆయన యందు ముందుగ విశ్వాస ముంచలేదో వారందరికి ఆయన బోధించెను. ఈ స్త్రీ యేసును గూర్చి వారికి తెలియ జేయక పోయినచో వారు యెన్నడును ఆయనను గూర్చి వినుటకు అవకాశము కలిగి యుండక పోవుదురు.

ఈ సమరయ స్త్రీని బట్టి మనము యే మంచి పాఠములు నేర్చుకొనగలము?

1. రక్షకుని గూర్చి తెలియజెప్పుటకు మౌనము వహించవద్దు. నీకు రక్షకుడైన యేసును గూర్చి తెలిసిన విషయములను అనేకులకు తెలియ జేయుము. బైబిలులోని విషయములను వారితో కలిసి చదివి, దేవుని చిత్తమును వారు కూడ నమ్మునట్లు అనుగ్రహించును.

2. మనము తలంచు దాని కంటె యెక్కువగా మన ప్రాబల్యము పనిచేయును. మన ద్వారా ప్రాబల్యము పొందిన వారు యితరులను ప్రభావితులను చేయగలరు.

3. మన వెనుకటి జీవితము యెంత పాప భరితమైనను, మన ప్రవర్తనను మార్చుకుని, మన మంచి ప్రాబల్యము ద్వారా అనేకులు ప్రభావితులు చేయబడుటకును, మన మంచి ప్రభావమును ప్రపంచమునకు తెలియ జెప్పుటకును ఆలస్యము చేయకుందము.

ఈ సమరయ స్త్రీ ద్వారా మనము సువార్తను చాటి చెప్పుటకు గాను చేయవలసిన ప్రయత్నములన్నియు చేయుటకు వెనుకాడ కుండుటకు నేర్చుకొందము.

# 17 లూదియ యొక్క మంచి మాదిరి

## (Lydia, a good Example)

అపొస్తలుల కార్యములు 16వ అధ్యాయములో లూదియ అను ఒక స్త్రీని గూర్చి మనము చూడగలము. ఆమె యొక్క మంచి మాదిరిని బట్టి మనము మూడు విషయములు నేర్చుకొందము.

లూదియ చాల దైవభక్తి గలిగిన స్త్రీ. ఆమె తన స్వస్థలమైన తుయతైర పట్టణములో లేదు కాని సర్వసాధారణముగ ప్రార్ధన జరుగు స్థలమందు ఆమె కనబడును. పౌలును, అతని పరివారమును నదీ తీరమున ప్రార్ధన జరుగు స్థలము నందు ఆమెను కనుగొనిరి. "విశ్రాంతి దినమున గవిని. దాటి నదీ తీరమున ప్రార్ధన జరుగుననుకొని అక్కడికి వచ్చి కూర్చుండి, కూడి వచ్చిన స్త్రీలతో మాట్లాడుచుంటిమి. అప్పుడు లూదియ యను దైవభక్తిగల యొక స్త్రీ వినుచుండెను" (అపొ.కా. 16:13-14). అచ్చట కూడి యున్న స్త్రీలతో పౌలు మాట్లాడుచుండగ పౌలు చెప్పిన మాటలయందు లూదియ లక్ష్యముంచెను. అమె దైవభక్తి కలిగినదే అయినప్పటికిని దేవునిని పూర్తిగా సంతోషపరచలేకుండెను. పౌలు చెప్పిన మాటల ద్వారా ఆమె ఒప్పింపబడెను.

అంగీకరించే హృదయము ఆమెకు కలదు గనుక పౌలు చెప్పిన మాటలను బట్టి ఆమె బాప్తిస్మము పొందెను. ఆమె మాత్రమే గాక ఆమె యింటి వారందరును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:15). నా దైవ భక్తిని దేవుడు నన్ను అంగీకరించునను సంతృప్తి నాకున్నదని ఆమె చెప్పలేదు.

కాని దేవుని యేర్పాటునకు ఆమె సంకల్పించుకొనెను.

లూదియ బాప్తిస్మము తీసికొనిన వెంటనే ఆమె మంచి మాదిరియని చెప్పుటకు మరియొక కారణము గలదు. పౌలునకును, ఆయనతో కూడి యుండిన పరివారమునకు ఆమె అతిథి సత్కారము చేసెను. నేను ప్రభువు నందు విశ్వాసము గలదానవని మీరు యెంచితే నా యింటికి వచ్చి యుండుడని వేడుకొని మమ్మును బలవంతము చేసెను" (అపో.కా. 16:15). క్రైస్తవులమైన మనమందరము ఇట్టి అతిథి సత్కారము చేయుటకు అజ్ఞాపింప బడితిమి. పరిశుద్ధుల అవసరములలో పాలు పొందుచు శ్రద్ధగా అతిధ్యము ఇచ్చుచుండవలెను (రోమా 12:18). ఉపయోగించకొనుట కొరకు దేవుడు మనకనుగ్రహించిన వాటిన యితరులకు పంచి యిచ్చు తరుణము కొరకు మనము ఎదురు చూచుచుండవలెను.

లూదియ యొక్కమంచి మాదిరి యైనదైవ భక్తి, విధేయత, ఆతిధ్య మిచ్చుట యను వాటిని అనుసరించుటకు సంసిద్ధులము కావలెను.

# 18. యేసుక్రీస్తులో సహాయకారియైన ప్రిస్కిల్ల

## (Priscilla, A Helper in Christ Jesus)

దైవ భక్తులైన స్త్రీల యొక్క జీవితములు మనము పరిశుద్ధ గ్రంథములో చదువుచున్నపుడు, వారు దేవునికి పరిచర్య చేసిన మాదిరిగ మనమును చేయుటకు నేర్చుకుందము, అట్టివారిలో ఒకరైన ప్రిస్కిల్లను గూర్చి మనము తెలిసికొందము.

అపొస్తలుడైన పౌలు తన సేవా పరిచర్యలోని భాగముగ కొరింథుకు వచ్చినపుడు అకుల, ప్రిస్కిల్ల యను దంపతులను కలిసి కొనెను. ప్రిస్కిల్ల పౌలును తమ యింట ఉండుమని ఆహ్వానించి తగిన రీతిగ సత్కారము చేసెను. పౌలు వారి యింట ఉండి క్రీస్తును గూర్చి అనేకులకు బోధించు చుండెను. పౌలు కూడ వారిద్దరితో కలిసి పనిచేయుచు జీవనోపాధి చేయుచుండిరి. “వారు వృత్తికి డేరాలు కుట్టువారు, పౌలు అదే వృత్తి గల వాడు గనుక వారితో కాపురముండెను. వారు కలసి పనిచేయు చుండిరి” (అపొ.కా. 18:1-9).

కొన్ని దినముల తరువాత ప్రిస్కిల్ల తన భర్తతో కలసి వెళ్లగా పౌలు ఎఫెసుకు వెళ్లెను. మరికొన్ని దినముల తరువాత పౌలు వారిని ఎఫెసులో విడిచిపెట్టి తాను యెరూషలేముకు వెళ్లెను. అకుల, ప్రిస్కిల్లలు ఎఫెసులో యుండినపుడు అపొల్లో అను ఒక యూదుని కలసికొనిరి. అతడు విద్వాంసుడును, లేఖనముల యందు ప్రవీణుడునై యుండెను. అతడు

ప్రభువు మార్గము విషయమై ఉపదేశము పొంది, తన ఆత్మయందు తీవ్రపడి, యోహాను బాప్తిస్మము మాత్రమే తెలిసికొనిన వాడైనను, యేసును గూర్చిన సంగతులు వివరముగ చెప్పి బోధించుచు సమాజ మందిరములో ధైర్యముగ మాటలాడ నారంభించెను. ప్రిస్కిల్లయు, అకులయువిని, అతని చేర్చుకొని దేవుని మార్గము మరి పూర్తిగా అతనికి విశదపరచిరి. వారి బోధనలు వినిన పిమ్మట అతడు లేఖనముల ద్వారా యేసే క్రీస్తని యూదులను ఒప్పించ గలిగెను(అపొ.కా. 18:24-28)

మరికొంత కాలమునకు ప్రిస్కిల్ల, అకులలు రోమాలో, నివసింప సాగిరి. పౌలు కొరింథు నుండి వ్రాసిన ఉత్తరములో నాజతపని వారైన ప్రిస్కిల్లకును, అకులకును నా వందనములు అని వ్రాసెను (రోమా 16:4). ఈ వాక్యములను బట్టి చూచినట్లయిన వారు తమ ప్రాణములను సయితము యిచ్చుటకు సిద్ధపడిరి. ఈ కార్యమును బట్టి పౌలును, పౌలు మాత్రమే గాక అన్యజనులలోని సంఘముల వారందరు వీరికి కృతజ్ఞులై యుండిరి (రోమా 16:4).

ప్రిస్కిల్ల యొక్క మంచి మాదిరికరమైన జీవితము ద్వారా అతిథి సత్కారము చేయుచు, దాతృత్వము కలిగియుండి, దేవుని వాక్యమును బోధించుచు, అవసరములలో యున్నవారికి నిస్స్వార్థముతో యిచ్చుచు దేవుని సేవ చేయుదము.

# 19. అపవాదిని ఎదిరించుడి

## (Resist the Devil)

అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారి పోవును (యాకోబు 4:7)

ఈ భూమి మీద మనము జీవించుచున్నపుడు అనేక పర్యాయములు అపవాది తప్పు చేయుటకు మనలను శోధించు చుండును. కొన్నిసార్లు శోధనకు లోనై మనము పొరబాటు చేయుచుందుము. ఇదియే 'పాపము". మనము పాపము చేయుచున్నపుడు దేవుని సంతోషపరచ జాలము. పాపము దేవుని నుండి మనలను ఆత్మీయముగా వేరు చేయును. మన పాపముల కొరకు క్రీస్తు ద్వారా క్షమాపణ పొందని యెడల, నిత్యత్వములో శిక్ష అనుభవింప వలసి వచ్చును.

పొరబాటు చేయుటకు దేవుడు మనలను శోధించునా? లేదు. "ఆయన ఎవరిని శోధింపడు, గనుక ఎవడైనను శోధింపబడినపుడు నేను దేవుని చేత శోధింపబడుచున్నానని అనకూడదు" (యాకోబు 1:13). దేవుడు మనలను శోధింపడు అయితే మరి యెవరు శోధించెదరు? యేసు సాతానుచే శోధింపబడెను. అయితే ఆయన పాపము చేయలేదు (మత్తయి 4:1-11). యేసు సాతానును ఎదిరించెను. అప్పుడతడు విడిచి పోయెను. అపొస్తలుడైన పేతురు సాతానును ఎదిరించుటలో జాగ్రత్తగ యుండుమని హెచ్చరించుచున్నాడు. "నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా యుండడి. మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మింగుదునా యని వెదకుచు తిరుగుచున్నాడు (1 పేతురు 5:8-9).

కొన్ని పర్యాయములు సాతానుడు కీడు చేయని విధముగ మాయ వేషము ధరించి వచ్చును గనుక మనము జాగరూకతతో యుండవలెను. “అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్త పడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు. కాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు” (మత్తయి 7:15) అని క్రీస్తు ప్రభువు అబద్ధ ప్రవక్తలను గూర్చి చెప్పుచున్నారు. “సాతాను తానే వెలుగు దూత వేషము ధరించు కొనుచున్నాడు”. సాతాను యొక్క ఈ మాయో పాయములన్నింటిని ఎదిరించుటకు గాను మనము బైబిలును జాగ్రత్తగా చదువు చుండవలెను. ఎవరైన దేవుని సంతోష పరచునట్లు ఫలానిది చేయుమని చెప్పినచో వారి యొక్క బోధలు దైవగ్రంధములో వ్రాయబడిన రీతిని యున్నావో, లేవోయని పరిశీలన చేయవలెను. వారి బోధలు బైబిలులో వ్రాయబడిన రీతిగ లేనిచో అవి సాతాను బోధలేగాని దేవుని మాటలు కావని గ్రహింపవలెను.

కొన్ని పర్యాయములు మీకు సుఖ సంతోషములు కలుగ జేయుదునని చెప్పి మాయ వేషముతో సాతాను మన దగ్గరకు వచ్చును. కనుక అట్టి విషయములో మనము జాగ్రత్త కలిగి యుండవలెను. ఈ భూమిపై కొంచెము కాలము సుఖ సంతోషములు అనుభవించుట కంటె పరలోకానందము అనుభవించుట శ్రేష్ఠమని మనము యెరిగి అట్టి మంచి నిర్ణయము తీసికొనవలెను. “మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనము కంటె, క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమనియెంచుకొని, అల్పకాలము పాప భోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొన లేదు” (హెబ్రీ 11:24-26). అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టి యుంచెను.

దేవుని వాక్యమును మనము శ్రద్ధతో చదివిన యెడల సాతాను యొక్క శోధనలను మనము గుర్తించగలము. అప్పుడు మనము సాతాను నెదిరించిన యెడల వాడు మన యొద్ద నుండి పారిపోవును.

# ౨౦. అది చాలునా?

## (Is it Enough?)

నైతిక జీవితము జీవించ ఆశపడు యే స్త్రీయైనా బైబిలు నుండి తాను యేమి నేర్చుకొనగలదో యని దానిని పఠించును. దేవుని యందు విశ్వాసము గలిగిన శారా, యేసునకు ఆయన శిష్యులకు పరిచర్య చేసిన మరియ, మార్త అను అక్కచెల్లెండ్రు, ఇతరులకు పరిచర్య చేయుటలో తన సమయమును వెచ్చించిన దోర్కా పౌలుయొక్క సేవా పరిచర్యలో సహాయపడిన ప్రిస్కిల్ల అను వారి యొక్కమంచి మాదిరులను మనము దైవ గ్రంథములో కనుగొనగలము. భర్తలను, బిడ్డలను ప్రేమించుట లోను, ఇతరులకు సువార్త బోధించుటలోను, ఇతరుల యెడల మనము ప్రవర్తించు ప్రవర్తన విషయములోను బైబిలులో మనకు మంచి నియమావళి నందు ఈ పై విషయములు లన్నింటిని ఏ స్త్రీ అయితే నెరవేర్చు చుండునో ఆమె తన గృహమును సంతోషముతో నింపగలదు. అయితే ఈ క్రియలన్నిటిని చేయుట ద్వారా ఒక స్త్రీ నిత్యజీవమును పొంద గలదా?

క్రొత్త నిబంధనలో ఒకని నీతి క్రియల ద్వారా పరలోక రాజ్యములో ప్రవేశించలేడు. తన పాపమును పోగొట్టు కొనలేడు. “మనము నీతి నను సరించి చేసిన క్రియల మూలముగా కాక తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను” (తీతుకు 3:5). అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి, మనము మన

అపరాధములచేత చచ్చిన వారమై యుండినపుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో బ్రతికించెను. కృప చేత మీరు రక్షింపబడి యున్నారు. క్రీస్తు యేసు నందు ఆయన మనకు చేసిన ఉపకారము ద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమునకు రాబోవు యుగములలో కనబరచు నిమిత్తము, క్రీస్తు యేసు నందు మనలను ఆయనతో కూడా లేపి, పరలోక మందు ఆయనతో కూడ కూర్చుండ బెట్టెను. మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడి యున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు. దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక యెవడును అతిశయపడ వీలులేదు. మరియు మనము వాటియందు నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింప బడిన వారమై ఆయన చేసిన పనియై యున్నాము (ఎఫెసీ 2:4-10).

క్రీస్తు యేసు ద్వారా, ఆయన కృప చేత మనకు పాప క్షమాపణ కలుగుచున్నది. "పాపము వలన వచ్చు జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసుందు నిత్యజీవము" (రోమా 6:23), విశ్వాసము ద్వారా పాపములు క్షమింపబడి మనము దేవుని బిడ్డలము కాగలము. "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26-27). మీరు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపొ.కా. 2:38), బాప్తిస్మము పొందిన తరువాత దేవునిని ఆరాధించుచు, ఆయనను సేవించుచు, ఆయన యందు విశ్వాసము గలవారమైన యెడల దేవుని కృప మన పాపములను క్షమించుచుండును. "ఆయన వెలుగులో యున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు

ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).

దేవుని సంతోష పెట్టుటకు మనము నీతిక్రియలను చేయుచుండ వలెను. నీతిక్రియలు మనలను మన పాపములనుండి రక్షింప లేవు. మనము పాపముల నుండి రక్షింపబడి, దేవునితో నిత్య జీవములో జీవించుటకు పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము తీసికొనవలెను. "ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పు చున్నాను. ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను'' (యోహాను 3:3-5). మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి (మార్కు 16:15).

మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశు ద్ధాత్మ అను వరమును పొందుదురు (అపొ.కా. 2:38). ప్రభువు వాక్యము మాసిదోనియలోను, అకయలోను మ్రోగెను. అక్కడ మాత్రమే గాక ప్రతి స్థలమందును దేవుని యెడల ఉన్న మీ విశ్వాసము వెల్లడాయెను గనుక మేమేమియు చెప్పవలసిన ఆవశ్యము లేదు (1థెస్స 1:8).

# 21. వినువారు మాత్రమయి ఉండకుడి

## (Not Hearers only)

యేసు ఒకసారి మీరు వినువారు మాత్రమే అయి ఉండక దానికి విధేయులై యుండవలెనని చెప్పెను. కాబట్టి ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండ మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధి మంతుని పోలియుండును. వాన కురిసెను. వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను. గనుక అది పడలేదు. మరియు ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలి యుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను. అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను (మత్తయి 7:24-27). కనుక బైబిలులోని బోధనలు వినుటకు అనేక మంది ఇష్టపడుదురు గాని కొద్ది మంది మాత్రమే దానికి విధేయులగుదురు.

అపొస్తలుడైన పౌలు ఒకసారి ఏథెన్సులోని గ్రీకులతో మాట్లాడు చుండెను. ఏమైన క్రొత్త విషయములను తెలిసి కొనుటకు వారాసక్తి కలిగిన వారు గనుక పౌలు యొక్క బోధన వినుచుండిరి. ఒకే నిజమైన దేవుని గూర్చి పౌలు వారికి బోధించుచుండెను. మీరు రక్షణ పొందవలెనని దేవుడు కోరుచున్నాడని పౌలు ఆ గ్రీకులతో చెప్పెను. కొంతమంది అయితే పౌలు బుద్ధిహీనమైన బోధలు చేయుచున్నాడనిరి. మరి కొంతమంది వినుటకు ఆసక్తి కనుబరచిరి. కాని కొద్దిమంది పౌలు బోధలను అంగీకరించిరి

(అపొ.కా. 17:16–34). అచ్చట నుండి పౌలు కొరింధునకు వచ్చి అచ్చట బోధించుచుండగా వినిన కొరింథీయులలో అనేకులు విశ్వసించి, బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 18:8).

వీరిలో యే ప్రజలను మీరు అనుసరించెదరు? దేవుని చిత్తము తెలిసికొని దాని విసర్జించెదరా? మీరు ఆసక్తి గలవారై వినినదానికి విధేయులకారా? లేక నిత్యజీవమును స్వతంత్రించు కొనుటకుగాను దేవుని చిత్తమును గూర్చి విని దానికి విధేయులగుదురా? దేవుని యొక్క ఆత్మ ప్రేరణతో యాకోబు ఈవిధముగ వ్రాయుచున్నాడు: "మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" (యాకోబు 1:22)

# మూడవ భాగము



# సమతుల జీవితము

## (A Balanced Life)

# ౨౨. సమతుల జీవితము

## (A Balanced Life)

ఒక వ్యక్తి క్రైస్తవుడుగ మారినపుడు వాని జీవితము మారును. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను" (2 కొరింథి 5:17). అతడు నూతన సృష్టియని బైబిలు చెప్పుచున్నది. ఈ క్రొత్త జీవితము దేని వలె యుండును? క్రైస్తవ జీవితమును గూర్చి బైబిలులో యేవిధముగ వివరించబడినదో తెలిసి కొందము.

"గొఱ్ఱెలకు జీవము కలుగుటకును, అది సమృద్ధిగ కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగ చెప్పుచున్నాను" (యోహాను 10:10). గొఱ్ఱెల యొక్క ప్రతి అవసరమును తీర్చే మంచి గొఱ్ఱెల కాపరిగా ఆయన తన్ను పోల్చుకొని యున్నాడు. మనము పేదరికములో జీవించవలెనని ఆయన కోరుట లేదు (2 కొరింథి 8:18–15). ఆయన మనకు ఐశ్వర్యము నిచ్చెదనని వాగ్దానము చేసెనా? మన అవసరతలలో మనకు సహాయము చేయుదునని ఆయన వాగ్దానముచేసి యున్నాడు. "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీ కనుగ్రహింప బడును (మత్తయి 6:38). పాత నిబంధన గ్రంథములోని జ్ఞాని వలె మనము ప్రార్థించవలెను. అది యేదనగా "పేదరికమునైనను, ఐశ్వర్యము నైనను నాకు దయచేయకుము. తగినంత ఆహారము నాకు అను గ్రహింపుము. ఎక్కువైన యెడల నేను కడుపు నిండినవాడనై నిన్ను విసర్జించి యెహోవా

యెవడని అందునేమో, లేక బీదనై దొంగిలి నా దేవుని నామమును దూషింతు నేమో" (సామెతలు 80:8-9).

క్రైస్తవ జీవితము తృప్తి కలిగి యుండే జీవితము. అనగా క్రైస్తవుడు యెల్లప్పుడు తన ముఖము మీద చిరునవ్వుతో యుండునని అర్ధము కాదు. మనకు గొప్ప మాదిరియైన యేసు ప్రభువే అనేక సార్లు యేడ్చినట్లు మనము చూడగలము. "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీ యొద్దకు పంపబడిన వారిని రాళ్లతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను ఏలాగు రెక్కల క్రింద చేర్చుకొనునో అలాగే నేనును నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి" (మత్తయి 23:37-38). "అప్పుడు యేసు మరణమగునంతగా నా ప్రాణము బహు దు:ఖములో మునిగియున్నది" (మత్తయి 26:88). "యేసు కన్నీళ్లు విడిచెను" (యోహాను 11:35). "సంతోషించు వారితో సంతోషించుడి. ఏడ్చువారితో ఏడువుడి" (రోమా 12:15) అని మనకు బోధింపబడి యున్నది. ఆయనను వెంబండించు వారికి శ్రమలు కలుగునని యేసు చెప్పెను. శ్రమలలో సహితము క్రైస్తవుడైన వ్యక్తి సంతోషముగ యుండును. దానికి కారణము మత్తయి 5:3-12 చదువవలెను. అపొస్తలుడైన పౌలు ఈ విధముగ చెప్పుచున్నాడు. "నేనే స్థితిలో యున్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగి యుండ నేర్చుకుని యున్నాను, (ఫిలిప్పీ 4:11). ఇది యేలాగు సాధ్యము? మన అవసరతల నిమిత్తమై ఆతురతలేని వారమై యుండి వాటి కొరకు దేవుని ప్రార్థించవలెను, "అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు నందు మీ హృదయములకును, మీ తలంపులకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:7).

క్రైస్తవ జీవితము సమాధానముతో కూడినది. యేసు యిట్లు చెప్పు చున్నాడు. సమాధాన పరచువారు ధన్యులు. వారు దేవుని కుమారులన

బడుదురు (మత్తయి 5:9). క్రైస్తవులైన వారు ఈ విధముగ ఆజ్ఞాపింపబడు చున్నారు. శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా యుండుడి (రోమా 12:18). అదే గ్రంధకర్తయైన పౌలు క్రైస్తవ జీవితము పోరాటముతో కూడికొనినది యని చెప్పుచున్నాడు. "మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు కడ ముట్టించితిని. విశ్వాసము కాపాడు కొంటిని" (2 తిమోతి 4:7). ఈ రెండు వాక్యములను బట్టి మనమే విధముగ జీవించగలము? "మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తి మంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, కాని ప్రధానులతోను అధికారుల తోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధుల తోను, ఆకాశ మండల మందున్న దురాత్మల సమూహములతో పోరాడుచున్నాము" (ఎఫెసీ 6:11-12). మీరు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా ఇంక దానిని ఎదిరింపలేదు" (హెబ్రీ 12:4). పై వాక్యములను బట్టి చూచిన మనము పోరాడునది ప్రజలతోకాదని, పాపములతోనని తెలియుచున్నది.

మనము సాతానును ఎదిరించుటకు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించవలసి యున్నది. "ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని, నీతియను మైమరవు తొడుగుకొని, పాదములకు సమాధాన సువార్తవలననైన సిద్ధ మనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడి, ఇవన్నియుగాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి. దానితో మీరు దుష్టుని అగ్నిబాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి (ఎఫెసీ 6:14-17). క్రైస్తవుడైన ప్రతి వ్యక్తి జ్ఞాపక ముంచుకొనవలసినది యేమనగా తమ విరోధి అపవాదియు సాతానని, ప్రజలు కారని. దేవుని సేవకుడైన వాడు ఎవరిపైనను ఎదురాడక అందరి యెడల సౌమ్యత కలిగియుండవలెను. బోధించుటకు సమర్థుడై, ఓర్పు,

దీనత్వము కలిగి యుండవలెను. "సత్య విషయమైన అనుభవ జ్ఞానము వారికి కలుగుటకై, దేవుడొక వేళ ఎదురాడు వారికి మారుమనస్సును దయచేయును. అందువలన సాతాను తన యిష్టము చొప్పున చెరపట్టిన వీరు వారి యురిలోనుండి తప్పించుకొని మేలు చేసెదరేమో యని ప్రభువు యొక్క దాసుడు అట్టి వారిని సాత్వీకముతో సహించుచు, జగడమాడక, అందరి యెడల సాధువుగాను, బోధింప సమర్థుడుగాను, కీడును సహించువాడుగాను ఉండవలెను" (2 తిమోతి 2:24-26).

ఈ ఉదాహరణను బట్టి చూచిన క్రైస్తవ జీవితము సమతుల జీవితమని తెలియుచున్నది.

# 23. అద్దములు

## (Mirrors)

అద్దములోనికి నీవు చూచినపుడు నీవు యేమి చూచెదవు? నీ ముఖము నీకు అంగీకారముగనే కనబడుచున్నదా, లేక దానిని సరిగ అమర్చుకొను అవసరమేదైనా యున్నదా? నీ జుట్టు చెరిగి పోయినదా? నీ గడ్డము పై మురికి చేరినదా? నీ ముఖము కోపముగ యున్నదా? ఏదైనా ఉండవలసిన విధానములో అది లేదని నీవు తెలిసికొనినప్పుడు దానిని సరిచేసు కొందువా లేక దాని విషయమై యేమి ఆలోచించక ఆ విషయము మరిచిపోయెదవా?

యాకోబు క్రొత్త నిబంధన గ్రంథములోని స్వాతంత్ర్యమును గూర్చిన కట్టడను అద్దముతో పోల్చెను. "ఎవడైనను వాక్యమును విను వాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవును గదా! అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలుకడగా యుండు వాడెవడో వాడువిని, మరచువాడు కాక, క్రియను చేయువాడై యుండి తన క్రియలో ధన్యుడగును" (యాకోబు 1:23 - 25).

క్రొత్త నిబంధన మనము చదివి దానిని ధ్యానించుచున్నపుడు మనము ఆత్మీయముగా నిజముగ యేమైయున్నామో తెలిసి కొందుము. మనము

సరిచేసుకొనవలసిన సమస్యల యొక్క పరిష్కార మార్గమును కూడ నేర్చుకొందుము. ఆ సమస్యలను మనము పరిష్కరించుకొనక పోయినచో తన ముఖముపై నున్న మురికిని చూచియు, దానిని శుభ్రము చేసుకొనని బుద్ధిహీనుని పోలియుందుము. దేవునికి అంగీకారములైన పనులను మనము చేసిన యెడల మనము దేవుని ద్వారా ఆశీర్వాదములు పొందగలము.

# 24. వాడబారని సౌందర్యము

## (A Beauty that never fades)

మనము నివసించుచున్న ఈ ప్రపంచములో శారీరక సౌందర్యమునకు చాల ప్రాధాన్యత ఈయబడుచున్నది. అనేక వ్యాపార ప్రకటనలలో అందమైన వ్యక్తులనుపయోగించుట ద్వారా వారిచే తయారు చేయబడుచున్న వస్తువులకు మంచి ఆకర్షణ కలుగునట్లు చేయుచున్నారు. పుస్తకములలో వ్రాయబడిన లేక సినిమాలలో నటించుచున్న కథానాయకులు, కథానాయకు రాండ్రందరు కూడ మంచి శరీర సౌందర్యము గలవారేనని మనకు తెలియును.

ప్రపంచములో ఈ సౌందర్యమునకు యెంతో ఎక్కువైన ప్రాధాన్యత గలదు. అయితే దేవుని దృష్టిలో బాహ్య సౌందర్యమునకు గల స్థానమేమిటో తెలిసికొనుట అవుసరము. నీవు సౌందర్యవంతు రాలవా? నీవు దేవుని దృష్టిలో కూడ సౌందర్యము గల దానివిగా యుండగలవు. క్రైస్తవ స్త్రీలకు యెటువంటి సౌందర్యము కావలెనని దేవుడు కోరుచున్నారు? బైబిలు గ్రంథము నుండి దానికి జవాబును తెలిసికొందము.

“జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించు కొనుటయు నను వెలుపటి అలంకారము మీకు అలంకారముగ యుండక, సాధువైనట్టియు, మృదువై నట్టియు నైనగుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగ యుండవలెను” (1పేతురు 3:3-5). మనుష్యులు లక్ష్యపెట్టు

వాటిని యెహోవా లక్ష్యపెట్టడు. మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు, గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1 సమూయేలు 16:7). అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము. యెహోవా యందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును' (సామెతలు 31:30).

ఈ పై వాక్యములను బట్టి చూచిన యెడల బాహ్య సౌందర్యము ప్రధానమైనది కాదుగాని, ఆత్మీయ సౌందర్యము, మన మంచి నడవడి దేవునికి ప్రశస్థమైనదని మనము తెలిసికొనగలము.

బాహ్య విషయములను బట్టి ప్రజలకు తీర్పు తీర్చుట ద్వారా వారిని అంగీకరించుట గాని, నిరాకరించుట గాని చేయువారు వారి యొక్క జీవితములో మధురమైన స్నేహమును, సంతోషముతో యుండే గృహములను కోల్పోవుదురు. ధనము కొరకు గాని, సౌందర్యము నాశించి గాని వివాహము చేసికొనిన వారు, వారి యొక్క వైవాహిక జీవితములో సంతోషమును అనుభవించలేరు. సరియైన రీతిగ ఆలోచించేవారు బాహ్య సౌందర్యము కంటె అంతరంగిక సౌందర్యమునకు ప్రాధాన్యత నిచ్చెదరు. సౌందర్యము, ఐశ్వర్యము సంతోషమును ఈయలేవని వారికి తెలియును.

బాహ్యసౌందర్యమును గూర్చి దేవుడు విమర్శించలేదు కాని, దానికి యెక్కువ ప్రాధాన్యత నీయ వద్దని హెచ్చరించుచున్నారు. ఎందుచేత? పుట్టిన ప్రతివారు సౌందర్య వంతులుగ పుట్టరు. సౌందర్యమనేది వయస్సుతో పోవును. కాని ప్రతివారు ఆత్మీయ సౌందర్యమును కలిగియుండగలరు. ఈ ఆత్మీయ సౌందర్యమనేది గృహమును, ప్రపంచమును కూడ ఆనంద దాయకముగ యుంచగలదు.

అంతరంగిక సౌందర్యమును కలిగించునదేది? బైబిలులో దానికి జవాబు గలదు. అంతరంగిక సౌందర్యమును కలిగి యుండే స్త్రీ యొక్క లక్షణములు కొన్ని ఈ దిగువ నీయబడినవి.

యెహోవా యందు భయభక్తులు కలిగి యుండును (సామెతలు 31:30).

ఇంటి యందు నమ్మకముగ పనిచేయును (సామెతలు 31:13, 19,21,22,27).

ఆమె భర్త యొక్క లాభప్రాప్తికి వెలితి కలుగ నీయదు (సామెతలు 31:11, 12,23).

ఆమె దీనులకు తన చెయ్యిచాపును, దరిద్రులకు తన చేతులు చాపును (సామెతలు 31:20).

బలమును, ఘనతయు ఆమెకు వస్త్రములు, ఆమె రాబోవు కాలము విషయమై నిర్భయముగా యుండును. జ్ఞానము కలిగి తన నోరు తెరచును: కృపగల ఉపదేశము ఆమె బోధించును (సామెతలు 31:25-26).

సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను - అక్షయాలంకారము (1పేతురు 3:4) కలిగియుండును.

స్వపురుషునకు లోబడి యుండును (1పేతురు 3:5).

గౌరవము కలిగి యుండవలెను (తీతుకు 2:9).

మంచి విషయములను బోధించువారై యుండవలెను. (తీతు 2:3). భర్తను, బిడ్డలను ప్రేమించువారై యుండవలెను (తీతు 2:4).

ప్రవర్తన యందు భయభక్తులు గల వారై యుండవలెను (తీతు 2:5,

ఆతిథ్యము చేయువారై యుండవలెను (1 తిమోతి 5:10)

నీవు సౌందర్యవంతు రాలవా? దేవుని మార్గము లన్నియు నీవు అనుసరించిన యెడల నీవు చాల సౌందర్యవంతురాలవుగా యుండగలవు.

# 25. మనము దేవుని నమ్ముచున్నామా?

## (Do we Trust God?)

అపొస్తలుడైన పౌలును అతని పనివారును క్రీస్తును గూర్చియు, రక్షణను గూర్చియు ప్రజలకు బోధించుచూ సంచారము చేయుచుండగ వారు కొరింథు, ఎఫెసు పట్టణములలో ఆగిరి. ఈ రెండు పట్టణములలోను వారు ఒకే సువార్తను బోధించినప్పటికిని ఆ రెండు పట్టణములలోను వేరు వేరు ప్రతిస్పందనలు కలిగినవి. మాంత్రికులు ధనార్జన కొరకు వారి కళను కొరింథులో ఉపయోగించు చుండిరి. కొరింథులో అది వారి ధన సంపాదన. అనగా వారి జీవనోపాధి కొరకు చేయబడే పని, ఎఫెసు పట్టణములో అర్తెమి దేవి (డయానా) దేవత విగ్రహములను చేసి వాటిని అమ్ముకొనుట ద్వారా కొంతమంది ప్రజలు తమ జీవనోపాధిని గడుపు కొనేవారు. కొరింథులోని మాంత్రికులు, ఎఫెసులోని కొంత మంది ప్రజలు (డయానా విగ్రహములు తయారు చేసి అమ్మేవారు) వారి జీవనోపాధి తగ్గిపోవు నేమోయని భయపడు చుండిరి.

పౌలు అతని పరిచారకులు చెప్పుచున్న బోధలు విని కొరింథులోని మాంత్రికులు అనేకులు తమ పుస్తకములను తెచ్చి అందరి యెదుట కాల్చివేసిరి. ఎవరికి తెలియకుండ వారు ఆ పుస్తకములను అమ్మివేసి కొనవచ్చును. కాని వారు ప్రజలను మోసము చేయుట ద్వారా లాభము పొందుచుండిరి. వారి జీవనోపాధి కొరకు వారు ఆ తరువాత యేమి చేసి యుండిరో నాకు తెలియదు. కాని దేవుడే వారిని పోషించి యుండునని

చెప్పగలను. వారు ఎంతమంచి మాదిరిని ప్రదర్శించిరో గదా!

ఎఫెసు పట్టణములో మాత్రము విగ్రహములను తయారు చేయువారు వారి లాభసాటి పోవునేమోయని భయము కలిగి యుండిరి. వారు అల్లరి మూకను సిద్దము చేసి పౌలు మీదకు, తన పనివారి మీదకు పంపి తొందర కలుగజేసిరి. విగ్రహములు తయారు చేయువారి యొక్క దురాశనుబట్టి ఎఫెసీయులు రక్షణను గూర్చి వారికీయబడిన తరుణమును పోగొట్టుకొనిరి.

ఒక మంచి పని చేయు నిమిత్తము ఎవరైనా ఒక ఉద్యోగమును గాని లేక ఉద్యోగములో ఉన్నత పదవి గాని యిచ్చిన వ్యక్తి మీకు తెలియునా? లేక దానిని గూర్చిన శ్రమ మరొకరు తీసికొనిరా? కొన్ని పాఠశాలలో కొంతమంది. ఉపాధ్యాయులు దేవుని గూర్చియు, ఆయన సృష్టిని గూర్చియు జరిగిన సంభాషణలను బట్టి వారు దేవునిని విడిచిపెట్టుటకు యిష్టపడక వారి ఉద్యో గములనే విడిచిపెట్టిన వారి విషయము నాకు తెలుసును. కొన్ని కొన్ని సమయములలో అబద్దము చెప్పుటకు యిష్టము చూపని వారు, అది స్త్రీయైనా పురుషుడైనా వారు తమ పదవులనే వదులుకొనవలసివచ్చును. ఈవిధమైన శ్రమ నీకు సంభవించినప్పుడు, నిన్ను కాపాడి, సంరక్షించే దేవుని యెడల నీవు నమ్మకము కలిగియుందువా? దేవుని విషయమైన శ్రమ యేదైనా సంభవించినప్పుడు కొరింధులోని మాంత్రికులవలె దేవుని కాపుదల కొరకు మనము దేవునిపై ఆధారపడునట్లు ప్రార్థించు కొందము. ఎఫెసులోని కంసాలుల వలె దురాశ కలిగి దేవుడిచ్చు రక్షణను నిరాక రించరాదు.

# 26. ప్రార్ధన నాకు ఏమైయున్నది

## (What Prayer means to me)

ప్రార్ధనయనేది దేవునితో సహవాసములో అర్ధభాగమై యున్నది. ఆయన వాక్యము, బైబిలు ద్వారా ఆయన నాతో మాట్లాడును. నేను ప్రార్ధన ద్వారా ఆయనతో మాట్లాడుదును. ఈ రెండు విధములుగా జరిగే ప్రక్రియ ద్వారా నాకు గొప్ప ఆదరణ కలుగును. ఈ రెండింటిలోనూ ఏ ఒక్కదాని ద్వారా కూడ పూర్తి సహాయము కలుగదు.

నేను ప్రార్ధించుకొనినపుడు ఎవరినైనా సంతృప్తి పరచవలెనని గాని, నటించవలసిన పనిగాని నాకు లేదు. నా అంతరంగిక హృదయము దేవునికి ముందుగనే తెలియును. కనుక నా పాపములను ఆయన సన్నిధిలో ఒప్పుకొని, వాటి కొరకు నేను దేవునిని క్షమాపణ కోరినపుడు ఆయన నన్ను చాలా తక్కువగా ఎంచుకొనుననే భయము నాకు లేదు.

నేను ఒంటరిగా యుండినపుడు ఆయన నాతో యుండి నా మాటలు వినుటకు కనిపెట్టుచుండును. యెహోషువకు దేవుడిచ్చిన వాగ్దానమే మనకును ఈయబడినది. "నిన్ను ఏ మాత్రమును విడువను. నిన్ను ఎన్నడును ఎడబాయను" (హెబ్రీ 13:5; యెహోషువ 1:6) ఆయన యెన్నడును మన మనవి వినుట మానడు. అంతమాత్రమేగాక ఆయన వాక్యము ద్వారా ఆదరణ కరమైన సలహాలు యిచ్చుటకు కనిపెట్టుచున్నాడు,

నేను తరచుగా జ్ఞానము కొరకు ప్రార్థించుకొనుచుందును. నా మనవిని ఆయన ఎల్లప్పుడును దయచేయునని నాకు తెలియును. "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువుగాయున్న యెడల అతడు దేవుని అడుగవలెను. అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడు. అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను" (యాకోబు 1:5-6).

కొన్ని పర్యాయములు దేవునికి యేమి చెప్పుకొనవలెనో నాకు తెలియని కొన్ని క్లిష్ట పరిస్థితులు నాకు సంభవించినపుడు, ఆత్మతోనే తండ్రియైన దేవునితో ఉచ్చరింప శక్యముగాని మాటలతో విజ్ఞాపన చేయుదును. ఈ విధముగ ఆత్మ కూడ మన బలహీనతలయందు మనకు సహాయము చేయును. అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగ ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని ఉచ్చరింప శక్యముగాని మూలగులతో ఆ ఆత్మ తానే మనపక్షముగ విజ్ఞాపనము చేయుచున్నాడు (రోమా 8:26-27). హృదయములను పరిశోధించు దేవుడు మన మనసులను ఎరిగియున్నందున ఆయన దేవుని చిత్తప్రకారము పరిశు ద్ధుల కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు.

బైబిలునుబట్టి నాకు సంబంధించిన వాటన్నింటి కొరకును నేను ప్రార్థించుకొనగలను. నాకు అనుగ్రహింపబడిన దీవెనలు కొరకు దేవునికి కృతజ్ఞతలు తెలియపరచుకొనుచూ నాకు అవసరమైన దీవెనలను అను గ్రహింపుమని కోరుచూ దేవుని స్తుతించుకొందును. దేవుని జ్ఞానము, శక్తి అపరిమితమైనవి. ఆయన నన్ను నిండైన ప్రేమతో ప్రేమించుచున్నారని నాకు తెలియును. కనుక మిక్కిలి శ్రేష్టమైన దీవెనలతో ఆయన నన్ను నింపి ఆయన చిత్తమును నెరవేర్చుకొనును. నేను ప్రార్థించిన అంశము

కొరకైన జవాబు మాత్రమే గాక అతిశ్రేష్టమైన జవాబును యిచ్చును. ఇది మనందరకు గొప్ప ఆదరణ.

"మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నింటికంటెను, ఊహించు వాటన్నింటి కంటెను, అత్యధికముగ చేయు శక్తిగల దేవునికి, క్రీస్తు యేసు మూలముగ సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక" ఆమెన్ (ఎఫెసి 33:20-21).

# 27. దుఃఖము

## (Grief)

యేసును. గూర్చి బోధించుచు అపొస్తులుడైన పౌలు అనేక స్థలములలో సంచారము చేసెను. వాటిలో ఒకటి ఎఫెసు పట్టణము. కొంతకాలము పౌలును, అతని సహచరులును ఎఫెసులో యుండినపుడు దేమేత్రి అను కంసాలి ప్రజలను వారి మీదకు తిరుగబడ జేసాడు. వారు మిగిలిన క్రైస్తవులకు కూడ కొంత హింస కలిగించిరి. అప్పుడు పౌలు ఎఫెసును విడచి సువార్త ప్రకటించుచూ ఇతర ప్రదేశములకును వెళ్లెను. ఎఫెసులో యున్న క్రైస్తవులను పౌలు మరచిపోలేదు. అతడు వారిని ప్రేమించుచు, వారి ఆత్మీయాభివృద్ధి నిమిత్తము ఎంతో భారము కలిగి యుండెను. పౌలు యెరూషలేమునకు ప్రయాణమై వెళ్లుచుండగా ఎఫెసుకు సమీపించు చున్నప్పుడు అచ్చటి సంఘ పెద్దలు వచ్చి పౌలును మిలేతులో కలిసి కొనవలెనని కోరెను. సంఘ పెద్దలు వచ్చినపుడు పరిశుద్ధత విషయములో సంఘమును గూర్చి జాగ్రత్త వహించవలెననియు, అబద్ధ బోధకులను గూర్చి జాగరూకతతో యుండవలెననియు వారిని హెచ్చరించెను. క్రీస్తు కొరకు నేను ఖైదీని కాబోవు చున్నాననియు, తనకు యేమి సంభవింప నైయున్నదో తనకు తెలియదనియు, వారిని యిక మరి చూడలేమోననియు వారికి తెలియబరచెను..

పౌలును వారు యొక్కువగ ప్రేమించు చుండుట చేత ఈ మాటలు వారికి చాల దు:ఖమును కలిగించెను. ఈ మాటలు వినగానే వారు యెట్లు

ప్రతిస్పందించిరో మనకు బైబిలు తెలియజెప్పుచున్నది. “అప్పుడు వారందరు చాల యేడ్చిరి. మీరు ఇక మీదట నా ముఖము చూడరని చెప్పిన మాటకు విశేషముగ దు:ఖించుచు, పౌలు మెడ మీద పడి అతనిని ముద్దు పెట్టుకొని ఓడవరకు అతనిని సాగనంపిరి” (అపొ.కా. 20:37-88).

ఒక క్రైస్తవ సమాధి కార్యక్రమములో ఒక్కసారి ఒక బోధకుడు ఈ విధంగా ఆ కుటుంబము వారితో చెప్పుచున్నాడు. “మీరు మిక్కిలి ప్రేమించు చున్న ఈమెను గూర్చి మీరు దు:ఖించ వద్దు. ఆమె యిప్పటి వరకు నివసించిన గృహము కంటె మరి శ్రేష్టమైన గృహమునకు వెళ్లెను”. క్రైస్తవుడైన వ్యక్తి ఈ లోక సంబంధమైన జీవితమును ముగించినప్పటి పరిస్థితులలో మనము దు:ఖపడవలసిన పనిలేదు. “మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పున దేమనగా, ప్రభువు రాకడ వరకు సజీవులమై నిలిచి యుండు మనము, నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము” (1థెస్స 4:18). మన ప్రియులను మనము కోల్పోయినపుడు ఈ లోకములో వారిని యిక ఎన్నడును మనము చూడలేము గనుక వారిని గూర్చి మనకు దు:ఖము కలుగుట సహజము. క్రైస్తవులైన మన ప్రియులను గూర్చి మనము దు:ఖించము గాని మనకొరకే మనము దు:ఖించెదము. మనము పోగొట్టుకొనిన వ్యక్తి యింకను ఈ భూమి మీద జీవిస్తు యిక మరెన్నడును వారిని చూడలేని ఎడబాటు కలిగినపుడు కూడ మనము దు:ఖించెదము. పౌలు ఎఫెసు సంఘ పెద్దలు యొక్క విచారమును గూర్చి బైబిలు అది సిగ్గుకరమని చెప్పుట లేదు. ఎందుకనగా. వారు ఒకరి నొకరు ప్రేమించు కొనిరి. గనుక వారి విషయములో ఆ ఎడబాటు దు:ఖకరమే.

కొన్ని సహజమైన పరిస్థితులలో దు:ఖము కలుగుట సహజమే. అవి మనము ప్రేమించే వారు అనారోగ్యముతో బాధపడుచున్నపుడు, కుటుంబ ములో ఎవరైనా తిరుగుబాటు ధోరణితో యుండినపుడు, లేక యుక్త వయస్సు

గల వారు వారి యొక్క స్వగృహమును విడిచి అనగా అప్పటి వరకు నివసించిన గృహమును విడిచి తన వ్యక్తిగతముగ స్వంత గృహమును యేర్పాటు చేసికొనుటకు వెళ్లుచున్నపుడు విచారము కలుగును. “సాధారణముగ మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు. మీరు సహించ గలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనీయడు. అంతేకాదు, సంహింప గలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును” (1 కొరింధి 10:13). ఆయన బిడ్డలకు శక్తియు, నిరీక్షణయు, సమాధానమును అనుగ్రహించును. కావున మన దు:ఖ సమయములలో ఆయనపై ఆధారపడి యుండుటకు మరువ వద్దు.

# 28. సాటియైన సహాయకారి

## (A Suitable Helper)

ఈ ప్రపంచమునంతటిని చేసిన ఆరవ దినమందు దేవుడు మానవుని సృష్టించెను. ఆ తరువాత అదే దినమున ఆయన స్త్రీని సృష్టించెను మరియు దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా యుండుట మంచిదికాదు; వానికి సాటియైన సహాయమును వాని కొరకు చేయుదుననుకొనెను" (ఆది.కా. 2:18). అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢ నిద్ర కలుగజేసి అతడు నిద్రించినప్పుడు అతని ప్రక్కటెముకలలో ఒక దానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొని వచ్చెను (ఆది.కా. 2:20-21). ఈ సృష్ట్యారంభములోనే మానవునకు ఒక సహాయకారి అవసరమని దేవునికి తెలియును. మానవుని అవసరతను తీర్చుటకు స్త్రీని నిర్మించెను. స్త్రీలమైన మనము ఎంతమట్టుకు మన భర్తలకు సహాయకరముగ యుండగలుగుచున్నాము?

మానవుడు ముందుగా సృష్టింపబడుట చేతను, మొట్ట మొదటి పాపము స్త్రీ ద్వారానే జరుగుట చేతను ప్రతి స్త్రీయు తమ స్వంత భర్తలకు లోబడి యుండవలసినవారై యున్నారు (1 తిమోతి 2:11-14: ఆది.కా. 3:16). విధేయత కలిగియుండుట అనే ఆజ్ఞను స్త్రీకి యిచ్చుట ద్వారా స్త్రీ జీవితమును దుర్భరము చేయుటకుద్దేశింప బడినదికాదు. ఎఫెసీ 5:22-23ను చదివిన

మనకు యిది గ్రహింపు కాగలదు. క్రీస్తు సంఘమును ప్రేమించిన రీతిగ పురుషుడు కూడ తన భార్యను మరణము మట్టుకు ప్రేమింప బద్ధుడై యున్నాడు. భర్తలు తమ స్వంత శరీరముల వలె తమ భార్యలను ప్రేమింపవలెను. "మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తనకువలె తన భార్యను ప్రేమింపవలెను, భార్య అయితే తన భర్తయందు భయము కలిగి యుండునట్లు చూచుకొనవలెను" (33). ఇది చాల ఆనందకరమైన సంబంధము.

రెండవదిగ భార్య తన యింటిని ఆనందమయముగ యుండునట్లు చూచుకొనవలెను. అపొస్తలుడైన పౌలు తిమోతికి ఈ విధముగ చెప్పుచున్నాడు. "కాబట్టి యౌవ్వన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని గృహ పరిపాలన జరిగించుచు, నిందించుటకు విరోధికి అవకాశమియ్యకుండ వలెనని కోరుచున్నాను" (1తిమోతి 5:14). మన గృహములను పరిశుభ్రముగను, చక్కగను అమర్చుకొనుట ద్వారాను, ప్రేమ, దయ, కనికరములతో కూడిన మంచి క్రమశిక్షణలో బిడ్డలను తర్ఫీదు చేసుకొనుట ద్వారాను, ప్రతి విషయములోను క్రైస్తవ్యమును ప్రదర్శించునట్లు చేయుట ద్వారాను మన గృహములను ఆనంద దాయకముగ యుంచగలము లేక చేయగలము. దేవుని ఆశీర్వాదము వలన మనకు కలిగిన దానిని ఇతరులకు యిచ్చునట్టి మనసు కలిగి యుండవలెను. ఈ విధముగా మనము చేయుట ద్వారా క్రీస్తు సంఘమునకు నాయకత్వము వహించుటలో మన భర్తలను సమర్థులనుగ చేయగలము (1తిమోతి 3:2).

మూడవదిగ క్రైస్తవుడు కాని భర్తకు తోడ్పడుటలో భార్యకు మరొక పద్ధతి గలదు. భర్తకు విధేయురాలై యుండి క్రైస్తవ ప్రవర్తనను నిరూపించు కొనుట ద్వారా అన్యుడైన భర్త క్రీస్తు వైపు మళ్లు కొనుటకు అవకాశము కలుగును. "అటువలె స్త్రీలారా, మీరు మీ స్వ పురుషులకు లోబడి యుండుడి; అందువలన వారిలో వాక్యమునకు అవిధేయులైతే వారు భయముతో కూడిన

మీ పవిత్ర ప్రవర్తనను చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్టబడ వచ్చును" (1 పేతురు 3:1). మాటలు చెప్పుటకంటె మంచి మాదిరికరమైన ప్రవర్తన ఎక్కువ మేలుకరముగ యుండును.

స్త్రీని సృష్టించిన ఉద్దేశమును నెరవేర్చుటకు భార్యలముగ యుండిన మనమందరము ప్రయాసపడుదము. ప్రతి విషయములోను మన భర్తలకు మంచి సహాయకురాండ్రముగ యుందము.

# 29. ప్రభువునందు ఆనందించుము!

## (Rejoice in the Lord!)

ఫిలిప్పయిలో యున్న సంఘమునకు అపొస్తలుడైన పౌలు ఈ విధమైన హెచ్చరిక వ్రాసెను. "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీ 4:4). అనగా దీనిని బట్టి క్రైస్తవులైన వారికి యే విధమైన శ్రమలుండవని, అందును బట్టి వారు యెల్లప్పుడు సంతోషముగ యుండవలెనని భావమా? ఎన్నో సమస్యలతో నిండియున్న ఈ ప్రపంచములో ఎల్లప్పుడూ యేవిధముగ మనము సంతోషముగ యుండగలము?

క్రైస్తవులకు కష్టములు, సమస్యలు ఉండవని పౌలు చెప్పలేదు. తాను క్రైస్తవునిగ యుండినందున అనేకములైన హింసలను, బాధలను అనుభవించెను (11 కొరింథి 11:28-24). హింసలు, బాధలు అనుభవించుచూ శ్రమలలో కూడ తాను సంతోషముగ యుండగల్గుటకు కారణమును రోమా పట్టణములోని క్రైస్తవులకు తెలియజేయుచున్నాడు. మనము ఎట్టి పరిస్థితులలోను కూడ దేవుని ప్రేమ నుండి ఎడబాటు చేయబడము. "క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను, కరువైనను వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా?" (రోమా 8:36), "మరణమైనను, జీవమైనను, ప్రధానులైనను, ఉన్నదియైనను, రాబోవునది

యైనను, అధికారులైనను, ఎత్తైనను, లోతైనను, సృష్టింపబడినది. మరి ఏదైనను మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8:38-39). మన సమస్యలు దేవునికి తెలియును గనుక ఆయన మనలను కాపాడును. మనము అనుభవించిన శ్రమలను బట్టి మనకు దీవెనలను గ్రహింప సమర్థుడు ఆయన. "దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగును" (రోమా 8:28). ఈ విషయములను గూర్చి మనమేమి చెప్పుదుము? "ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షమున నుండగ మనకు విరోధి యెవడు? (రోమా 8:31). దేవుని ప్రేమ ఆయన దయ, మనలను గూర్చి ఆయన వహించుచున్న జాగ్రత్త మనకు ఉండినపుడు నిజముగ మనమెల్లప్పుడు సంతోషముగ యుండగలము.

# ౩౦. సంతోషముగ యుండుటెట్లు ?

## (How to be Happy?)

సంతోషముగ యుండుట అనేది ప్రతివారు ఆశించేదే కాని కొద్ది మంది మాత్రమే దానిని అనుభవిస్తారు. ధనికులైనట్టి వారు సంతోషముగ యుండగలరని కొంతమంది భావించెదరు. కాని ఈ ప్రపంచములో దుర్మార్గులైన వారు కూడ అనేకులు ధనవంతులుగ యున్నారు. సంతోష మనేది ఒక వ్యక్తి ఏమైయున్నాడో దానిపై ఆధారపడి యుండును గాని అతనికి కలిగిన దానిపై ఆధారపడి యుండదు. వ్యక్తి యొక్క స్థితి, ధనము ద్వారా విలాసవంతముగ గడుపవచ్చును. అయితే నిజమైన, సంతృప్తి కరమైన, చివరి వరకు నిలిచే సంతోషాన్ని అవి ఈయలేవు. ఎంత పేదవాడైన సంతోషాన్ని అనుభవింప వచ్చును. అతడు దేవుని ద్వారా కలిగే సంతోషమును అనుభవించుటకు చూచుకొనవలెను.

దేవుడు మనము ఆనందముగ యుండవలెనని కోరుచున్నాడని తెలియజేయుటకు బైబిలు గ్రంథములో అనేక విషయములు వ్రాయబడినవి. "అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు ఈవిధంగా తెలియబరచు చున్నాడు. ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీ 4:4). మత్తయి సువార్త ఐదవ అధ్యాయములో ప్రభువైన యేసు మనము దేవుని నుండి మనసానందమును ఎట్లు పొందగలమో తెలియజేయు చున్నారు. కింగ్ జేమ్స్ యొక్క తర్జుమా

ప్రకారము బైబిలులో “ధన్యత” అను మాటకు లోతైన సంతోషము అనగా అపరిమితమైన సంతోషమని అర్ధము.

క్రీస్తు ఈవిధముగా చెప్పుచున్నారు.

ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. సాత్వీకులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు. కనికరముగలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు.

సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు.

నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు పరలోక రాజ్యము వారిది.

నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి, మీ మీద అబద్ధముగా చెడ్డమాట లెల్ల పలుకునపుడు మీరు ధన్యులు; సంతోషించి, ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును.

మీరు సంతోషముగా యుండగోరుచున్న యెడల ఇదియే మార్గము.

ఈ పై విధముగా జీవించు వ్యక్తి నిజమైన ఆనందాన్ని అనుభవించ గలడు. మనము నిజమైన ఆనందాన్ని అనుభవింపగోరిన యెడల క్రీస్తు చెప్పిన బోధలు అనుసరింపవలెను. అప్పుడు సంతోషముతో దేవుడు మనలను దీవించును.

# 31. జ్ఞానమందు పెరుగుట

## (Grow in Knowledge)

నా జనులు జ్ఞానములేనివారై నశించుచున్నారు (హోషేయ 4:6). ప్రజలందరు రక్షింప బడవలెనని దేవుడు కోరుచున్నారు. మన పాపముల నుండి మనము విముక్తి పొందవలెననిన దేవుని చిత్తమును ఎరిగిన వారమై దానికి విధేయులమై యుండవలెను. “ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదినై యున్నది. ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు” (1 తిమోతి 2:3-4). “సత్యము మిమ్మును స్వతంత్రు లనుగా చేయును” (యోహాను 8:32). మనము సత్యమును తెలిసికొనిన వారమైతే దానిని మన బిడ్డలకును దానిని బోధింప గలము (2 తిమోతి 1:5). క్రీస్తు యేసునందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు, శక్తిగల పరిశుద్ధ లేఖనములను బాల్యమునుండి నీవు ఎరుగుదువు గనుక నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొనినది యెవరి వలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని వాటియందు నిలకడగా యుండుము (2 తిమోతి 3:15).

మనము సత్యమునెట్లు తెలిసికొనగలము? మత బోధకులైన ప్రతి వారి మాటలు మనము అంగీకరింపగలమా? మన భర్తలుగాని, స్నేహితులు గాని సత్యమును గూర్చి మనలను నమ్మించగలరా? చివరకు అపొస్తులుని యొక్క మాటలు నమ్ముటలో జాగ్రత్త వహించిన కొంత మందిని గూర్చి

బైబిలు గ్రంథము తెలియపరచుచున్నది. “వీరు థెస్సలోనికలో యున్న వారికంటె ఘనులై యుండిరి. గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును, సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో, లేవో యని ప్రతిదినము లేఖనములు పరిశోధించుచు వచ్చిరి” (అపో.కా. 17:11). అపొస్తలుడైన పౌలు గలతీయులకు ఈ విధంగా చెప్పుచున్నాడు. “మేము మీకు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను, పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక (గలతి 1:8). మతపరమైన విషయములలో ఏది యదార్థమైన బోధయో మనమెట్లు తెలిసికొనగలము? బైబిలు గ్రంథములో వ్రాయబడిన విషయములను బోధించువారు ఆ గ్రంథములో వ్రాయబడిన వాక్యములను ఋజువు చేయవలసిన వారై యున్నారు. మతపరమైన విషయముల కొరకు మనము మనుష్యులపై ఆధారపడ కూడదు.

బైబిలు గ్రంథమును ఎవరికి వారే చదువవలెనని దేవుడు మనలను గూర్చి ఆశించుచున్నారు. దేవుని యెదుట యోగ్యుని గాను, సిగ్గుపడ నక్కరలేని పనిగాని గాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము (2 తిమోతి 2:15). దేవుని గూర్చిన సత్యమును తెలిసికొనిన తరువాత దానికి విధేయులమై యుంటూ బైబిలు గ్రంథమును చదువుటకు కొనసాగించుట ద్వారా మన జ్ఞానము యింకా అభివృద్ధి చెందును. చాలాకాలము క్రిందట పేతురు క్రైస్తవులను ఈ విధముగ హెచ్చరించాడు. “మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృప యందును, జ్ఞాన మందును అభివృద్ధి పొందుడి. ఆయనకు యిప్పుడును యుగాంత దినము వరకును మహిమ కలుగును గాక. ఆమేన్” (2 పేతురు 3:18).

# ౩౨. ఆత్మనిగ్రహములో పెరుగుట

## (Growing in self control)

మనము క్రైస్తవులముగ మారినప్పటి నుండి దేవుని సేవ చేయుటకు మనలను మనము అర్పించు కొనెదము. మనము క్రైస్తవులముగ మారిన వెంటనే పరిపూర్ణ క్రైస్తవ జీవితము జీవించవలెనని దేవుడు కనిపెట్టుట లేదు. పేతురు క్రైస్తవులకు ఈ విధముగ వ్రాయుచున్నాడు. క్రొత్తగా జన్మించిన శిశువులను పోలిన వారై నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి (1 పేతురు 2:8). కాబట్టి మన బాప్తిస్మము తరువాత ఆత్మీయముగ ఎదుగవలెనని దేవుడు కోరుచున్నారు. మనము ఆత్మీయముగ పెరుగుటకు యింకను అనేక విషయములను గూర్చి పేతురు వ్రాయుచున్నాడు. “ఆ హేతువు చేతను మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్త గలవారై మీ విశ్వాసము నందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానము నందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనము నందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి” (2 పేతురు 5:1-7). ఈ వాక్య భాగములో ఆశానిగ్రహ మనగా ఆత్మనిగ్రహము, అనగా దీనత్వమని అర్థము.

ఆత్మ నిగ్రహము అనగా దీనత్వము కలిగి యుండుట యనేది కొద్దిగ కష్టతరమైన విషయమే. కాని నిజముగ దానిని అలవరచు కొనుటకు మనము ప్రయత్నించి మన నాలుకను మన స్వాధీనములో యుంచు

కొనినయెడల మిగిలిన శరీర భాగములన్నియు పూర్తిగ స్వాధీనము లోనికి వచ్చును. మన నాలుక మనకు చాల తొందర కలిగించి మనసుకు బాధను కలిగించును. మనకు కోపము వచ్చిన సమయములో నిర్భయంతో కూడిన మాటలు మాట్లాడి మనసుకు లోతైన గాయములు కలుగ జేయును. మన నిర్లక్ష్యము ద్వారా కలిగే కొంత తొందరను తగ్గించు కొనుటకు సత్యమును చెప్పుటకు బదులు అబద్దము చెప్పుదుము. దేవుని ప్రేమ మనలో లోపించుట వలన వ్యర్థమైన మాటలను ప్రచురము చేయుదుము. ఇతరులు మన పై అసూయ పడునట్లు మనకు కలిగిన ఘనతను, హక్కును గూర్చి డంబపు మాటలు చెప్పుదుము. ఈ విధంగా అనేకమైన విషయములలో నాలుకను స్వాధీన మందుంచుకొనక పోవుటచే ఆత్మ నిగ్రహమును కోల్పోవుదుము.

"అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాటయందు తప్పని యెడల అట్టి వాడు లోపము లేనివాడై, తన సర్వ శరీరమును స్వాధీన మందుంచుకొన శక్తి గల వాడగును. గుఱ్ఱములు మనకు లోబడుటకై నోటికి కళ్లెము పెట్టి వాటి శరీర మంతయు త్రిప్పుదుము గదా! ఓడలను కూడ చూడుడి; అవి ఎంతో గొప్పవై పెనుగాలికి కొట్టుకొని పోబడినను, ఓడ నడుపువాని ఉద్దేశము చొప్పున మిక్కిలి చిన్నదగు చుక్కాని చేత త్రిప్పబడును" (యాకోబు 3:2-4).

మన నాలుకను మన స్వాధీన మందుంచు కొనుటకు ప్రయత్నించుట ద్వారా మనము ఆత్మ నిగ్రహమును కలిగి యుందుము.

# 33. శ్రమ ఓర్పును కలిగించును

## (Suffering produces patience)

అపొస్తలుడైన పౌలు రోమాలోని క్రైస్తవులకు ఈ విధముగ వ్రాయు చున్నాడు.. "శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగ జేయునని యెరిగి శ్రమల యందును అతిశయ పడుదము" (రోమా 5:3). శ్రమలలో యేవిధంగ సంతోషమును కలిగి యుందురు? శ్రమ యెట్లు ఓర్పును కలుగ జేయును?

క్రైస్తవ్యమును బట్టి అపొస్తలుడైన పౌలు తానే యెన్నో శ్రమలను అనుభవించెను. క్రీస్తు సువార్తను ప్రకటించుటలో అనేక సార్లు దెబ్బలు కొట్టిరి. సముద్రములో ఓడ పగిలి, గాలి వాన ఎదురై ఈ విధముగ అనేక సార్లు ఆపదలలో యుండి నప్పటికిని విశ్వాసులకు కలిగే బహుమానమును అందుకొనుటకు వాటన్నింటిని ఎంచదగినవిగా అతడు లెక్కించ లేదు.

క్రీస్తుతో కూడ మనము శ్రమలను ఆయన కొరకు అనుభవించిన యెడల ఆయనతో కూడ మనము మహిమ పొంద గల్గుటకు ఆశించ వచ్చును. "మనము దేవుని పిల్లలమని ఆత్మతానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చు చున్నాడు. మనము పిల్లలమైతే వారసులము; అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమ పడిన యెడల క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:16-17). "క్షణ మాత్రముండు మీ చులకని శ్రమ మీ కొరకు అంత కంతకు యెక్కువగ నిత్యమైన మహిమ భారమును కలుగజేయు చున్నది" (2 కొరింథి 4:17). ఇందును బట్టి

మనము గ్రహించ వలసినదేమనగా మన క్రైస్తవ జీవితమును బట్టి శ్రమ కలిగిన యెడల మనము ఆనందించవలసిన వారమై యున్నాము. “నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునపుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును. ఈ లాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి” (మత్తయి 5:11-12).

దుర్మార్గులైన వారిని వారి దుర్మార్గతను బట్టి శిక్షించక మనకు హానిచేయునట్లు దేవుడు వారిని అంగీకరించు చున్నాడని మనము తలంచ వచ్చును. కాని యేసు ఈ విధముగ చెప్పుచున్నాడు. “దేవుడు తాను యేర్పరచు కొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొరపెట్టుకొను చుండగ వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును” (లూకా 18:7). దుర్మార్గులైనట్టి వారికి శిక్ష విధించకుండ దేవుడు వారిని తప్పించుకొన నీయడు. “మిమ్మును శ్రమ పరచు వారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే” (11థెస్స 1:9).

ఈ లోకములో మనము దేవుని కొరకు శ్రమలనను భవించిన యెడల మనము ఓర్పు కలిగి యుండుటకు నేర్చుకొందుము. ఓర్పు యందు బలము కలిగి దుర్మార్గులకు శిక్షయు, విశ్వాసులైనట్టి వారికి బహుమానము పొందుటకు కనిపెట్టుదము. మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ ఎదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నదగినవి కావని ఎంచుచున్నాను (రోమా 8:18).

# 34. ప్రభువు కొరకు కనిపెట్టుము

## (Wait on the Lord)

నీవు యెప్పుడైన విసుగు కలిగియుంటివా? 'విసుగు'' అనేది మానవత్వము. నిర్ణీత సమయములో మనము ఒక ప్రత్యేకమైన స్థలము నకు వెళ్లవలెనని తొందర పడుచుందుము. మన బిడ్డలు మనకు వెంటనే విధేయులు కావలెనని కోరుదుము. మనము చేయదలచిన పని ఆ నిర్ణీత సమయములో పూర్తికావలెనని కోరుదుము. మన పద్ధతి. మనము ఏర్పాటు చేసుకొనిన సమయము శ్రేష్టమైనవని తలంతుము. అయితే దేవుడు ఆ విధంగా చెప్పటం లేదు. మనకు శ్రేష్టమైన వేమో, అని యెప్పుడు జరుగుట మనకు శ్రేష్టమో ఆ విషయములను గూర్చి బైబిలు గ్రంధములో అనేక పర్యాయములు మనకు సూచింపబడినవి.

కొన్ని వందల సంవత్సరములు క్రిందటనే దేవుని ప్రవక్తలైన వారు రక్షకుని గూర్చి ప్రవచించిరి. యేసు ప్రభువు పుట్టక పూర్వము నుండియే దేవుని ప్రజలైన వారు విమోచనము కొరకు ఆశించు చుండిరి. ఈ లోకములో యేసు ప్రభువు యొక్క జననమును గూర్చిన శ్రేష్టమైన, స్పష్టమైన నిర్ణీత సమయము దేవునికి తెలియును. ఆయన మనకొరకు బలియై, రక్షణ సంకల్పమును గూర్చి కూడ ఆయనకు తెలియును. "అయితే కాలము పరిపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మ శాస్త్రమునకు లోబడి యున్న వారిని విమోచించుటకై ధర్మశాస్తమునకు లోబడిన వాడయ్యెను మరియు

మీరు కుమారులై యున్నందున నాయనా, తండ్రీ అని మొరపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయముల లోనికి పంపెను. కాబట్టి నీవిక దాసుడువు కావు, కుమారుడవే. కుమారుడవైతే దేవుని ద్వారా వారసుడవు" (గలతీ 4:4-7).

దేవుడు అనంత జ్ఞానియని, సర్వశక్తి సంపన్నుడని, స్వభావమును బట్టి ప్రేమ స్వరూపియని మనము నమ్ముదుము. మనకు ఏదైనా ఒక శ్రేష్టమైన విషయము సంభవించినపుడు, దేవుడు శ్రేష్టమైన దానిని మనకు యిచ్చునని తలంచక ఎందుకు నీవు సందేహించెదవు? మన జ్ఞానముపై యెక్కువైన నమ్మకము కలిగి యుంటిమా? ఆ విధముగ చేయకుండు నట్లు దేవుడు మనలను హెచ్చరించుచున్నాడు. నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మిక ముంచుము. నీ ప్రవర్తన అంతటి యందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును" (సామెతలు3:5-6).

నీవు ఈ పై విషయములను తెలిసికొని వాటిని నమ్మిన తరువాత కూడ దేవుని కొరకు కనిపెట్టుటకు నీకు కష్టముగా యున్నదా? దేవుని సమయము, ఏర్పాటు కొరకు కనిపెట్టుటకు కారణములను, ప్రేరకములను గూర్చి ప్రవక్తయైన యెషయా, ఈ విధముగా చెప్పుచున్నాడు. "మీ యందు దయ చూపవలెనని యెహోవా ఆలస్యము చేయుచున్నాడు. మిమ్మును కరుణింప వలెనని ఆయన నిలువబడి యున్నాడు. యెహోవా న్యాయము తీర్చు దేవుడు. ఆయన నిమిత్తము కనిపెట్టు కొను వారందరు ధన్యులు" (యెషయా 30:18). యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు (యెషయా 40:31), తన కొరకు కనిపెట్టు వారి విషయమై నీవు తప్ప తన కార్యము సఫలము చేయు మరి ఏ దేవునిని ఎవడు ఏ కాలమందు చూచి యుండలేదు (యెషయా 64:4). యెహోవా కొరకు ఎదురు చూచెదను. రక్షణ కర్తయగు నా దేవుని కొరకు

నేను కనిపెట్టి యుందును. నా దేవుడు నా ప్రార్థన ఆలకించును (మీ కా 7:7). మన అసహనమును గూర్చి దేవునికి తెలియును కనుక కొన్ని విషయములలో ఈ అసహనమును దేవుడు చూచి, చూడనట్లున్నాడు. "మనము నిరీక్షణ కలిగిన వారమై రక్షింపబడితిమి. నిరీక్షింపబడునది కనబడునప్పుడు, నిరీక్షణతో పని యుండదు. తాను చూచుచున్న దాని కొరకు ఎవడు నిరీక్షించును? మనము చూడని దాని కొరకు నిరీక్షించిన యెడల ఓపికతో దాని కొరకు కనిపెట్టుదుము" (రోమా 8:24-25).

మనము అత్యంత ప్రాముఖ్యమైన నిత్యరక్షణ కొరకు దేవుని యందు నమ్మిక కలిగి యుండిన, చిన్న చిన్న విషయములకు కూడ దేవుని యందు నమ్మిక కలిగి యుండలేమా? "తన స్వంత కుమారుని అనుగ్రహించుటకు వెనుతీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించిన వాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు"? (రోమా 8:82). మీ తల వెంద్రుకలన్నియు లెక్కింపబడి యున్నవి. గనుక మీరు భయపడకుడి. మీరనేకమైన పిచ్చుకల కంటె శ్రేష్టులు (మత్తయి 10:29- 31). ఆయన బిడ్డలమైన మనకు కావలసిన వన్నియును ఆయన మన కనుగ్రహించును (మత్తయి 6:25-88).. ఆయన తలంపులు గాని, మార్గములు గాని మనమెన్నడును గ్రహింపలేము. ఆయన మన విషయములలో యేర్పాటు చేసిన సమయము కూడ మనకు తెలియదే, కనుక ప్రజలు మనకు దేవుని యందు గల విశ్వాసమును, ఆయన మనలను కాపాడుచున్న విధమును బట్టి మనము సంతోషించుటను వారు చూచి తెలుసుకొనునట్లు మన జీవిత విధానమును మలచు కొందుము. మనము దేవుని యందు సంతోషించుటను బట్టి వారు దేవుని వైపు ఆకర్షితులు కాగలరు.

# 35. అంతరంగములో సమాధానము కలిగియుండుట

## (Finding Inner Peace)

ఈ భూమి మీద మనము నివసించు చున్నప్పుడు అన్ని పరిస్థితులు మనకు ఆనందదాయకముగ యుండవు. అనేక పర్యాయములు క్లిష్టమైన పరిస్థితులను మనము ఎదుర్కొన వలసి యుండును. మనకు అనారోగ్యము కలుగవచ్చు. కుటుంబములో మరణము సంభవింపవచ్చు. ఆర్థికపరమైన యిబ్బందులుండవచ్చు. హింస కలుగవచ్చు లేక మనకు భారమును కలుగజేయు అనేకములు సంభవింపవచ్చును. ఈ విధమైన భారభరిత జీవనము నుండి తప్పించుకొను మార్గమేదియు మనకు కానరాని సమయములో మనమేమి చేయవలెను? నిస్సహాయులమని తలంచక క్రైస్తవులైన వారికి ఒక ప్రత్యేక సహాయము సిద్ధముగ యున్నదని మనము తెలుసుకొనవలెను.

క్రైస్తవులకు కలుగుచున్న హింసలను బట్టి అనేక మంది క్రైస్తవులు అనేక స్థలములకు చెదిరిపోయిరి. అట్టివారికి పేతురు ఈవిధంగ వ్రాయు చున్నాడు. 1పేతురు 1:1-5 చదువండి. “దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి. ఆయన మిమ్మును గూర్చి చింతించు చున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి” (1 పేతురు 5:6-7).

యేసును వెంబడించే వారికి సమాధాన మిచ్చెదనని ఆయన వాగ్ధానము చేసెను. ఈ సమాధానము లోకమిచ్చునట్టి సమాధానము వంటిది కాదు. "శాంతి మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీకను గ్రహించుచున్నాను; లోక మిచ్చునట్టుగా నేను మీకు అనుగ్రహించుట లేదు; మీ హృదయమును కలవర పడనియ్యకుడి, వెరవనియ్యకుడి" (యోహాను 14:27). సుఖ జీవనమును గూర్చి యేసు మనకు వాగ్ధానము చేయలేదుగాని, పరిస్థితులను అధిగమించి సమాధాన హృదయమును కలిగి యుండుటను గూర్చిన విషయమును మనకు తెలియపరచెను.

విశ్వాసముతో మనము యేసు నొద్దకు వెళ్లిన యెడల మన భారమంతటిని తీసివేసి మన ఆత్మలకు విశ్రాంతి కలుగజేయును. అదే సమయ ములో మనము యేసును సేవించుటకు అంగీకరించిన వారమై ఆయన యొద్ద నేర్చుకొనవలెను. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగ జేతును (మత్తయి 11:28). నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నాకాడి సుళువుగాను, నాభారము తేలిక గాను ఉన్నవి" (మత్తయి 11:29-80).

మనము దు:ఖము చేతను, కష్టముల చేతను కృంగి యుండినపుడు బైబిలు గ్రంథము నందు వ్రాయబడిన విశ్వాసులైన వారిని గూర్చి మనము జ్ఞాపకము చేసికొనవలెను. హెబ్రీ 11వ అధ్యాయములో అనేక మంది విశ్వాస వీరులను గూర్చి వ్రాయబడి యున్నది. వారు ఈ భూమిపై నివసించినప్పుడు అనేక కష్టములను ఎదుర్కొనిరి. వారిలో కొంతమంది చాలా యెక్కువైన హింసలను అనుభవించిరి. కష్టతరమైన ఎగతాళి మాటలు, చెరసాలలో యుంచబడుట, అనేక హింసలను అనుభవించుట, చివరకు మరణము. అన్ని బాధలు వారు భరించిరి. అయితే వాటన్నింటిని వారి

యొక్క విశ్వాసము చేత వాటిని అధిగమించిరి. ఇట్టి దైవజనులైన వారియొక్క విశ్వాస జీవితములను మనము మంచి మాదిరిగ యుంచు కొని మనమును మన యొక్క విశ్వాసమును పెంపొందించు కొనవలెను. ఈ భూమిపై మనకు కలుగుచున్న శ్రమలను బట్టి అధైర్యపడక నీతి యుక్తమైన జీవితమును విడువరాదు. "ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడ ప్రతి భారమును, సుళువుగ చిక్కులు బెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించు వాడునైన యేసు వైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్య పెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు" (హెబ్రీ 12:1-2).

నీ పరిస్థితులే మైనప్పటికిని, నీవు నీ హృదయములో శాంతి, సమాధానములను కోరుకొనినచో దీన మనస్సు గలిగి నీవు దేవుని సన్నిధిని వెళ్లిన యెడల ఆయన నీ భారమంతటిని తొలగించును. నీ విశ్వాసము నుండి నీ పరిస్థితులు నిన్ను క్రుంగ దీయునట్లు చేయకుము. యేసు ఈవిధంగ చెప్పుచున్నారు. "ఇదిగో మీరు శోధింప బడునట్లు అపవాది మీలో కొందరిని చెరలో వేయింపబోవుచున్నాడు. పది దినములు శ్రమ కలుగును. మరణము వరకు నమ్మకముగా యుండుము. నేను నీకు జీవ కిరీట మిచ్చెదను" (ప్రకటన 2:10).

# 36. జీవితములో ప్రాముఖ్యమైన దానిని ఎంచుకొనుట

## (Life's most important choice)

చాల కాలము క్రిందట అబ్రహాముకు దేవుడు వాగ్దానము చేసిన భూమిని సంపాదించుకొనుటకు ఇశ్రాయేలీయులు కనిపెట్టు చుండిరి. వారి నాయకుడైన మోషేను పర్వతము పైకి రమ్మని దేవుడు పిలుచు సరికి వారు యోర్దాను నదీ తీరమున బస చేసియుండిరి. వారు స్వాధీన పరచుకొననై యున్న దేశమును దేవుడు అచ్చట మోషేకు చూపించెను. మోషే యొక్క అవిధేయత వలన ఆ వాగ్దాన దేశములో ప్రవేశించుటకు దేవుడు మోషేకు సెలవియ్యలేదు. ఆ పర్వతముపై మోషే చనిపోగా దేవుడు మోషేను భూ స్థాపితము చేసెను.

మోషే చనిపోవుటకు ముందుగనే ఆయన యేర్పాటు చేసికొనిన జనాంగమునకు నాయకుని యేర్పాటు చేసెను. అనేక సంవత్సరములు యెహోషువ దేవునికి నమ్మకస్థుడుగ యుండెను. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాసత్వమునుండి విడిపింపబడిన తరువాత కానాను దేశమును వేగు చూచుటకు పంపబడిన పండ్రెండుమందిలో యెహోషువ యొకడు. ఆ పండ్రెండు మంది వేగుల వారిలో యెహోషువ, కాలేబులు మాత్రమే వాగ్దాన దేశమును స్వతంత్రించు కొందుము అనే గొప్ప విశ్వాసమును కనబరచిరి. మిగిలిన ఇశ్రాయేలీయుల యొక్క అవిశ్వాసమును బట్టి అరణ్యములో నలుబది సంవత్సరముల వరకు వారిని తిరుగు లాడ జేసెను. యెహోషువ మోషేకు ముఖ్య సహాయకునిగ యుండేవాడు. గనుకనే మోషే తరువాత

ఆ జనాంగమునకు నాయకునిగ యెహోషువను ఎంచుకొనెను.

కొన్ని సంవత్సరముల తరువాత యెహోషువ యొక్క నాయకత్వము వలన దేవుని యొక్క మహాశక్తిని బట్టియు కనాను దేశమును స్వాధీన పరచుకొనిన తరువాత యెహోషువ వారిని షెకెమునకు రమ్మని పిలిచెను. అబ్రహామునకును, అతని సంతానమునకును వాగ్దాన దేశమును వారికి స్వాధీన పరచుటకు దేవుడు శతాబ్దముల తరబడి యెట్లు సహాయము చేసి నడిపించెనో యెహోషువ అచ్చట వారికి జ్ఞాపకము చేసెను. దేవుడు అబ్రహముతో చేసిన వాగ్దానమును బట్టి పాలు, తేనెలు ప్రవహించునట్టి కనాను దేశమును ఇశ్రాయేలీయులకు స్వాస్థ్యముగ అప్పగించెను. యెహోషువ వారికి ఈ విధముగ చెప్పెను. “మీరు సేద్యము చేయని దేశమును, మీరు కట్టని పట్టణములను మీకిచ్చి యున్నాను. మీరు వాటిలో నివసించుచున్నారు. మీరు నాటని ద్రాక్షతోటల పండ్లను, ఒలీవ తోటలో పండ్లను తినుచున్నారు” (యెహోషువ 24:18).

దేవుని యొక్క గొప్పప్రేమను, మహాశక్తిని గూర్చి ప్రజలకు జ్ఞాపకము చేసిన తరువాత యెహోషువ ఈ బోధన వారికి చేసెను. “యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, . నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవించెదరో, అమోరీ యుల దేశమున మీరు నివసించుచున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి. మీరెవరిని సేవింప కోరుకొనినను నేనును, నా యింటివారును యెహోవాను సేవించెదమనెను” (యెహోషువ 24:15) ప్రజలందరు ఈ మాటలు వినినప్పుడు వారు యెహోవా దేవుని సేవించుటకు అంగీకరించిరి. “యెహోవానే సేవించెదము, ఆయనయే మా దేవుడని ప్రత్యుత్తర మిచ్చిరి” (యెహోషువ 24:18).

యెహోవా మార్గముల ననుసరించి నడువకపోయిన యెడల కలుగ

బోయే శిక్షనుగూర్చి యెహోషువ ప్రజలకు తెలియజేయగా, యెహోవాను సేవించెదమని మరల చెప్పిరి.

ఈ దినమున నేను, నీవు కూడ ఈ మంచి విషయమును ఎంచుకొన వలసిన వారమై యున్నాము. నిజ దేవునిని ఆరాధించి, ఆయనను అనుసరించెదవా? లేక మనుష్యులచే చేయబడిన వ్యర్థమైన దేవతలను సేవించెదవా? మనము సరియైన దానిని ఎంచుకొనిన యెడల అనేక ఆశీర్వాదములు కలుగును. ఆయన మనలను ఎన్నడును విడువను, ఎడబా యనని వాగ్దానము చేసెను. "నేను నీకు తోడై యుండి, నీవు వెళ్ళు ప్రతి స్థలమందు నిన్ను కాపాడుచు, ఈ దేశమునకు నిన్ను మరల రప్పించెదను. నేను మీతో చెప్పునది నెరవేర్చు వరకు నిన్ను విడువ నని యాకోబుతో చేసిన ప్రమాణము చొప్పున చేసెను" (ఆది. కా. 28:15). క్రైస్తవులైన వారికందరికి ఈ వాగ్దానము చేసెను. "నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడను ఎడబాయను" (హెబ్రీ 13:5). సజీవుడైన దేవునిని ప్రతిదినము సేవించుటకు నిశ్చయించుకొనుము. ఆయన నిత్యజీవమును నీకిచ్చుట ద్వారా నిన్ను దీవించును.

Second printing - December 2021

This book is translated from English to Telugu by
**Jessie Salome Jason**